


## 2న ముఖ్యమంత్రి రాక?



విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వచ్చే నెల రెండో తేదీన నగరానికి రానున్నారు. తూర్పుతీరంలో నౌకా వ్యాపారం విస్తరణ, ఇతర అంశాలపై మంగళవారం ఉదయం నోవాటెల్ హోటల్‌లో జరగనున్న ఈస్టుకోస్టు మేరీ టైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్‌లో ఆయన పాల్గొననున్నారు. అయితే ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పూర్తి షెడ్యూల్ ఇంకా వెలువడాల్సి ఉంది.

# సేనలో నూతనోత్సాహం

## సేనాని ప్రసంగానికి హర్షధ్వానాలతో మార్మోగిన మునిసిపల్ స్టేడియం

## జనసేన 'సేనతో సేనాని' సభ సూపర్ సక్సెస్

- భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): 'సేనతో సేనాని' పేరుతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ నగరంలోని ఇందిరాప్రియదర్శిని మునిసిపల్ స్టేడియంలో శనివారం నిర్వహించిన సభ సూపర్ సక్సెస్ అయింది. అంచనాకు మించి భారీగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పవన్ ప్రసంగానికి జేజేలు కొడుతూ అరుపులు, కేకలు, చప్పట్లతో స్టేడియం మార్మోగింది. పవన్ ప్రసంగం కేడర్‌లో నూతనోత్తేజం నింపింది.

జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్తలతో నిర్వహించిన 'సేనతో సేనాని' కార్యక్రమం విజయవంతమైంది. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహించిన తొలి బహిరంగ సమావేశం కావడంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచే కాకుండా తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలకు చెందిన కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సభలో పవన్ కల్యాణ్ గతానికి భిన్నంగా ప్రసంగించారు. పార్టీ కార్యకర్తలకు భవిష్యత్తు ... మిగతా 6వ పేజీలో



సభకు భారీగా తరలివచ్చిన జనసైనికులు, వీరమహిళలు

సభలో వీర మహిళల ఉత్సాహం

ప్రసంగిస్తున్న జన సేనాని పవన్‌కల్యాణ్

మత్స్యకార వికాస విభాగం బహూకరించిన చేపతో జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్

## అంతా ఒకే మాటపై ఉండాలి

### వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

### పార్టీ శ్రేణులకు పవన్‌కల్యాణ్ దిశా నిర్దేశం

### విశాఖలో ముగిసిన జనసేన సమావేశాలు

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జనసేన పార్టీ మూడు రోజులు నిర్వహించిన సమావేశాలు విజయవంతంగా ముగిశాయి. క్రియాశీలక కార్యకర్తలతో ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం నిర్వహించిన 'సేనతో సేనాని' కార్యక్రమం సూపర్ సక్సెస్ అయ్యింది. ఈ సమావేశానికి ఏపీతో పాటు తెలంగాణ, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. జనసేన పార్టీపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని విశాఖ వేదిక పైనుంచి అధినేత పవన్ కల్యాణ్ తిప్పికొట్టారు. పదవివచ్చాక పార్టీని పట్టించుకోవడం

లేదని ప్రచారం చేశారని, వాస్తవానికి తనకు పరిపాలనపై పట్టు సాధించడానికే పది నెలల సమయం పట్టిందన్నారు. ఇకపై పార్టీ వ్యవహారాలను తానే చూస్తానని, నెలకు పది రోజులు కేటాయిస్తానని, మండల స్థాయి నాయకులను తానే పర్యవేక్షిస్తానని ప్రకటించారు. పార్టీ కార్యకర్తలు నాయకులుగా ఎదగాలని, దానికి కష్టనష్టాలకు ఓర్చుకునేలా తయారుకావాలని హితబోధ చేశారు. వైసీపీ చేసే విమర్శలను, దుష్ప్రచారాన్ని అంతా కలిసికట్టుగా తిప్పి కొట్టాలని, ఈ విషయంలో అంతా ఒక మాటమీదే ఉండాలని సూచించారు. తొలిరోజు బే వ్యూ హోటల్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమయ్యారు. పార్టీ నాయకులు కొంతమంది పద్ధతి మార్చుకోవాలని సుతిమెత్తగా హెచ్చరించారు. రెండో రోజు రుషికొండలో వైసీపీ రూ.453 కోట్లతో నిర్మించిన ప్యాలెస్‌ను పరిశీలించి, దానిని ఈ శీతాకాలంలోనే ... మిగతా 6వ పేజీలో

## డిసెంబరు 14న నేవీ మారథాన్

- సెప్టెంబరు 1 నుంచి రిజిస్ట్రేషన్లు



నేవీ మారథాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎన్ఎస్ కళింగ కమాండింగ్ ఆఫీసర్ అనిరుధ్ రాయ్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, తదితరులు

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ నేవీ మారథాన్ (వీఎన్ఎం-25)ను డిసెంబరు 14న నిర్వహించనున్నట్టు ఐఎన్ఎస్ కళింగ కమాండింగ్ ఆఫీసర్ అనిరుధ్ రాయ్ తెలిపారు. డాల్ఫిన్ హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీఎన్ఎం-25లో పాల్గొనే వారు సెప్టెంబరు ఒకటో తేదీ నుంచే వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చునన్నారు. దీనికి డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.వైజాగ్‌నేవీమారథాన్.రన్ వెబ్ సైట్ చూడాలన్నారు. గతంలో మాదిరిగానే 42.195 కి.మీ (ఫుల్ మారథాన్), ... మిగతా 6వ పేజీలో

## ముగిసిన డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

- ఉమ్మడి జిల్లాలో 1,139 పోస్టులకుగాను 1,138 మంది అభ్యర్థులు హాజరు
- ఒకరు ఇటీవల మృతి
- జోన్ పరిధిలో 307 మంది హాజరు

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియామకాల్లో కీలకమైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఉక్కునగరంలోని విశాఖ విమల విద్యాలయంలో గురువారం నుంచి ఈ కార్యక్రమం మొదలైంది. ఉమ్మడి జిల్లాలో పాఠశాల విద్యా శాఖ నుంచి 734, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 400, జువెనైల్ శాఖ పరిధిలో ఐదు పోస్టులు...మొత్తం 1,139 పోస్టులకుగాను 1,138 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఒక అభ్యర్థి ఇటీవల మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు ఫోన్ ద్వారా విద్యా శాఖకు సమాచారం అందించారు.

కాగా జోన్-1 పరిధిలో వివిధ కేడర్‌లలో 307 పోస్టులకుగాను 307 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. అయితే ఉమ్మడి జిల్లాలో పోస్టులు, జోన్ పోస్టులకు వచ్చిన అభ్యర్థులలో ఆరేడుగురు సరైన సర్టిఫికెట్లు సమర్పించలేకపోయారు. ప్రస్తుతానికి వారిని అనర్హులుగా ప్రకటించారు. దీనిపై పాఠశాల విద్యాశాఖ తుది నిర్ణయం తీసుకోవలసి ఉంది. కాగా ధ్రువపత్రాల పరిశీలన ప్రశాంతంగా ముగిసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. అభ్యర్థులకు నియామక పత్రాలు ఎప్పుడు ఇస్తారనేది ఇంకా ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకోవల్సి ఉంది.

## జేఎన్ఎన్‌యూఆర్ఎం బస్సులకు తాత్కాలిక బ్రేక్

### బస్సు దగ్ధం నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాలు



స్టీల్‌సిటీ డిపోలో నిలిచిపోయిన జేఎన్ఎన్‌యూఆర్ఎం బస్సులు

- అన్నీ స్టీల్‌సిటీ డిపోనకు తరలింపు
- బస్సుల కండిషన్‌ను పరిశీలించిన సీనియర్ అధికారులు

ద్వారకా బస్‌స్టేషన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్ (జేఎన్ఎన్‌యూఆర్ఎం) కింద కొనుగోలు చేసిన 18 బస్సులకు తాత్కాలికంగా బ్రేక్‌పడింది. వీటిని స్టీల్ సిటీ డిపోలో నిలిపివేశారు. ఈ డిపో నుంచి విజయనగరం వెళుతున్న జేఎన్ఎన్‌యూఆర్ఎం మెట్రో ఎక్స్‌ప్రెస్ శుక్రవారం జాతీయ రహదారిపై శాంతిపురం జంక్షన్ వద్ద షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. ఈ విషయం నగరంలోనే ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి వెళ్లింది. దీంతో అధికారులను విచారించారు. రీజియన్‌లో ఉన్న అలాంటి బస్సులన్నీ వెంటనే నిలిపివేయాలని, సాంకేతికతను పరిశీలించిన తరువాత మాత్రమే రవాణా సేవలకు వినియోగించాలని ఆదేశించారు. దీంతో ఈ బస్సులన్నింటినీ శుక్రవారం మధ్యాహ్నం స్టీల్ సిటీ డిపోనకు తరలించారు.

జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాకు 2015-17 మధ్య నాలుగు దశల్లో 18 బస్సులు వచ్చాయి. జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం వీటిని సమకూర్చింది. వీటి కొనుగోలు ఖర్చులో 50 శాతం కేంద్రం భరించగా, మిగిలిన మొత్తం ఆర్టీసీ చెల్లించింది. ఈ ... మిగతా 6వ పేజీలో

## కబ్జాదారులకు చెక్

- గండిగుండంలో ప్రజాప్రతినిధి ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమి స్వాధీనం
- మరికొన్ని ఆక్రమణలో ఉన్నట్టు ఫిర్యాదులు
- విచారణ చేపట్టిన అధికారులు





ఆక్రమిత భూమి స్వాధీనం చేసుకుని బోర్డు ఏర్పాటుచేసిన రెవెన్యూ అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం మండలం గండిగుండం గ్రామ రెవెన్యూ పరిధిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూముల స్వాధీనానికి అధికారులు నడుంబిగించారు. ఈ ప్రాంతానికి చెందిన ఓ ప్రజా ప్రతినిధి, ఆయన కుటుంబం ఆధీనంలో ఉన్న భూముల వివరాలు సేకరించిన అధికారులు తొలుత సర్వే నంబర్ 212-1లో గల ఎకరా భూమిని స్వాధీనం చేసుకున్నారు. జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఈ భూమి విలువ సుమారు ఐదారు కోట్ల రూపాయలు ఉంటుంది. చాలాకాలంగా సదరు ప్రజా ప్రతినిధి ఆధీనంలో ఉన్న ఎకరా భూమిలో సరుగుడు వేశారు. ఇటీవల తోటలు నరికేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైన విషయం గ్రామ రెవెన్యూ అధికారులుగా పనిచేసిన వారికి తెలిసినప్పటికీ లంచాలు తీసుకుని చర్యలు తీసుకోకుండా వదిలేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గండిగుండంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదులు రావడంతో అధికారులు కదిలారు. సర్వే నంబర్ 212-1లో ఎకరా భూమిని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. కాగా ఆ ప్రాంతంలో సుమారు ఆరేడు ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణలో ఉన్నట్టు అధికారులకు సమాచారం అందింది. ఒకే కుటుంబంలో మైనర్ల పేరిట గతంలో డీపట్టాలు తీసుకున్నారు. ఇంకా ఇనాం భూమి స్వాధీనం చేసుకుని సహకార సొసైటీ నుంచి రుణం తీసుకున్నట్టు ... మిగతా 6వ పేజీలో

## స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు ముఖ్యమంత్రి కృషి

### ప్రక్షాళనలో భాగంగానే యాజమాన్యం సింగిల్ విండో కాంట్రాక్టర్ విధానాన్ని తీసుకొస్తోంది

- 42 విభాగాలకు 42 మంది కాంట్రాక్టర్‌లు మాత్రమే ఉండేలా చర్యలు
- నిర్వాసితులకు అన్యాయం జరగదు
- కాంట్రాక్టు కార్మికుల పోస్టుల్లో 50 శాతం నిర్వాసితులకు కేటాయించాల్సిందే
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటు పరిరక్షణకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. శనివారం గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంటు ప్రక్షాళనలో భాగంగా యాజమాన్యం సింగిల్ విండో కాంట్రాక్టర్ విధానాన్ని తీసుకువస్తున్నదన్నారు. గతంలో వెయ్యి మంది కాంట్రాక్టర్‌లు ఉండేవారని, ప్లాంటుపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రస్తుతం 42 విభాగాలకు 42 మంది కాంట్రాక్టర్‌లు మాత్రమే ఉండేలా చర్యలు ... మిగతా 6వ పేజీలో

## ఏయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రాంబాబు?



విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రాంబాబు నియమితులు కానున్నట్టు చెబుతున్నారు. ఈ మేరకు వీసీ నుంచి ప్రొఫెసర్ రాంబాబుకు సమాచారం అందింది. ప్రస్తుత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయన ఒకటో తేదీన బాధ్యతల నుంచి తప్పుకోనున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఫ్యాకల్టీ అఫైర్స్ డీన్‌గా పనిచేస్తున్న సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ రాంబాబు పేరును రిజిస్ట్రార్ పదవికి వీసీ ప్రతిపాదించారు. అందుకు ఉన్నత విద్యా మండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రాంబాబు నియామకానికి సంబంధించి ఇంకా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

## పారదర్శకంగా బార్‌ల కేటాయింపు ప్రక్రియ

- ఆశావహుల సమక్షంలో లాటరీ తీసిన జేసీ
- 131 బార్‌లకుగాను 67 బార్ల కేటాయింపు



లాటరీ తీస్తున్న జేసీ

సిరిపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బార్‌ల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా జరిగింది. శనివారం వీఎంఆర్డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆశావహుల ... మిగతా 6వ పేజీలో


బాధితునికి మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా

## సీఎం సహాయ నిధి పేదలకు వరం

**- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు**

కొమ్మాది, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయ నిధి పేదలకు ఒక వరమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మధురవాడ వైఎస్సార్ కాలనీకి చెందిన అన్నపూర్ణమ్మకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ. 41 వేల సీఎం సహాయ నిధి చెక్కును శనివారం ఆయన తన నివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, నాగోతి సత్యనారాయణ, ఓలేటి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

**ఆనందపురం :** మండలంలోని పాలవలస పంచాయతీ గుడిలోవ గ్రామానికి చెందిన కోరాడ అప్పలరాజు కొన్ని నెలలు క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి సీఎం సహాయ నిధి కింద రూ. 51 వేలు మంజూరయ్యాయి. ఈమేరకు ఎమ్మెల్యే గంటా శనివారం తన నివాసంలో మృతుడి కుమారుడు ఆనంద్‌కు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తాత్రాజు అప్పారావు, తర్లువాడ సర్పంచ్ నాయుడు, నాయకులు మద్ది శేఖర్, కోరాడ రమేశ్, పాలవలస నారాయణరావు, ఆనంద్, రవి పాల్గొన్నారు.

## సింహాద్రినాథునికి ఆర్జిత సేవలు


స్వామివారికి గరుడ సేవ చేస్తున్న అర్చకులు

సింహాచలం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామికి పలు ఆర్జిత సేవలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్ర నామావళి పఠిస్తూ తులసీ దళాలతో పూజలు చేశారు. తరువాత గోవిందుడ్ని రజిత గరుడ వాహనంపై ఉంచి గరుడ సేవ జరిపారు. అనంతరం అదే వేదికపై నిత్య కల్యాణం నిర్వహించారు.

## అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు


కప్ప స్తంభం వద్ద పరిశ్రమల శాఖ కార్యదర్శి అవినాష్‌జోషి

సింహాచలం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని పలువురు ప్రముఖులు శనివారం దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో రాష్ట్ర ప్రభుత్వ ఆహార ప్రోసెసింగ్,పరిశ్రమల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అవినాష్ జోషి, పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) ఉన్నారు. వారికి దేవాలయ సహాయ కార్యనిర్వాహణాధికారి కె.తిరుమలేశ్వరరావు ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండప ప్రదక్షిణ చేసిన ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు శేషవస్త్రాలతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు.

## బోధనలో నూతన పద్ధతులు అవసరం

తగరపువలస, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు నూతన పద్ధతుల్లో పాఠాలు బోధించాలని భీమిలి డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎల్. సుధాకర్ తెలిపారు. శనివారం ఆయన చిట్టివలస బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. పిల్లలకు చదవడం, రాయడం నేర్పడంతో పాటు గణితంలో నైపుణ్యాభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులతో ముఖాముఖి సమావేశం జరిపి, విద్యా విధానంలో నూతన సంస్కరణల గురించి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణలో కొత్త విధానం ఎలా ఉందన్న అడిగారు. ప్రతి ఉపాధ్యాయుడు డిజిటల్ బోధనకు సిద్ధ పడాలని చెప్పారు.

## క్వాంటం టెక్నాలజీతో అపార అవకాశాలు

సాగర్‌నగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : క్వాంటం టెక్నాలజీతో భవిష్యత్తులో అపార అవకాశాలు ఉంటాయని ఆచార్య పీవీ శర్మ అన్నారు. రుషికొండలోని గాయత్రి కళాశాలలో ఏఐసీటీఈ అటల్ కార్యక్రమంలో భాగంగా క్వాంటం కంప్యూటింగ్‌పై శనివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. క్వాంటం కంప్యూటింగ్ అన్నది భారతదేశానికి కేంద్ర బిందువు కావాలన్నారు. జీవీపీ ఈసీఈ విభాగాధిపతి ఆచార్య డాక్టర్ జీఆర్ఎస్ మూర్తి మాట్లాడుతూ సదస్సుకు దేశం నలుమూలల నుంచి 455 మంది ఫ్యాకల్టీ సభ్యులు హాజరయ్యారని తెలిపారు.

## పారదర్శకంగా బార్‌ల కేటాయింపు

... 5వ పేజీ తరువాయి

సమక్షంలో లాటరీ తీసి బార్లను కేటాయించారు. జిల్లాలో 131 బార్‌లకు (రిజర్వ్ 10+ఓపెన్ 121) 263 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించి గీత కులాలకు పది, జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 57 బార్‌లను కేటాయిస్తూ నూతన బార్ పాలసీ నిబంధనల ప్రకారం లాటరీ ప్రక్రియను నిర్వహించారు. ఈ ప్రక్రియలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు. దరఖాస్తులు రాక మిగిలిపోయిన బార్ విషయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలియజేశారు.

## అంతా ఒకే మాటపై ఉండాలి

... 5వ పేజీ తరువాయి

వినియోగంలోకి తీసుకువస్తామని ప్రకటించారు.అనంతరం బేవ్యూ హోటల్‌లో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ఆగిందని, అయినప్పటికీ కొంతమంది కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, దానిని తిప్పికొట్టాలని నాయకులకు పిలుపునిచ్చారు. కూటమిలో విభేదాలు వద్దని, అది పార్టీతో పాటు రాష్ట్రానికి తద్వారా ప్రజలకు కూడా నష్టమని స్పష్టంచేశారు. ఇంకో పదిహేనేళ్ల కూటమితో కలిసి ప్రయాణం చేయాల్సి ఉందని స్పష్టంచేశారు. ఈ సమావేశాల నిర్వహణకు 12 కమిటీలను వేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, డీసీసీబీ అధ్యక్షుడు కోన తాతారావు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

# భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యం

**సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు**


గోడ కూలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఈఓ త్రినాథరావు

సింహాచలం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఇంజినీరింగ్ అధికారులు పనిచేయాలని సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు ఆదేశించారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధంపై దృష్టిసారించాలని చెప్పారు. శనివారం ఆయన అధికారులతో కలిసి సింహగిరిపై విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులు ప్రస్తుతం త్రిపురాంతక స్వామి ఆలయం వద్ద కొబ్బరికాయలు కొడుతున్నారని, దాన్ని జోడుభద్రాలకు మార్చాలని అధికారులకు సూచించారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అలాగే భక్తులు తమ వెంట తీసుకువచ్చిన ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లను ఆలయంలోకి తీసుకువెళ్లకుండా ప్రవేశ ద్వారాల వద్ద నిషేధించాలని చెప్పారు. సింహగిరిని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓతో పాటు డీఈఈ డీవీఎస్ రామరాజు, ఏఈఓ పంతం శ్రీనివాస్, పర్యవేక్షణాధికారి రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

### దసరాలోగా మెట్ల మార్గం పునరుద్ధరణ

గోడ కూలిన ప్రాంతాన్ని శుభ్రం చేసి విజయదశమిలోగా మెట్ల మార్గాన్ని పునరుద్ధరిస్తామని ఈఓ త్రినాథరావు చెప్పారు. శనివారం ఆయన దేవస్థానానికి చెందిన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి గోడ కూలిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా దశమి నాడు కొండదిగువ అప్పన్న పూదోటలో జరిగే శమీ పూజకు సింహగిరిపై నుంచి స్వామివారిని పల్లకిలో కాలినడకన మెట్ల మార్గంలో తీసుకురావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈమేరకు దేవస్థానం సొంత నిధులు రూ. 18 లక్షలతో పనులు చేపడుతున్నామని చెప్పారు. వీటిని దసరాలోగా పూర్తి చేసి, మెట్ల మార్గాన్ని పునరుద్ధరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజినీర్లు రమణ, రామకృష్ణ, ఏఈ రవిరాజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

పద్మనాభం రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం నేపథ్యంలో అధికారులు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యదర్శి జి. వెంకటలక్ష్మి కోరారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. నెల రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాల వల్ల గ్రామాల్లో పారిశుధ్యం లోపించి వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వల వల్ల దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు వస్తున్నాయన్నారు. ఇప్పటికే పలువురు జ్వరాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

## ఐటీబీపీ హెడ్ క్వార్టర్స్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య


నరేంద్రనాథ్ (ఫైల్‌ఫొటో)

ఆనందపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పందలపాక సమీపంలోని 56వ ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) బెటాలియన్ హెడ్ క్వార్టర్స్‌లో ఒక కానిస్టేబుల్ (జీడీ) శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్టు సీఐ చింతా వాసునాయుడు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా డోన్ మండలం ఆర్ఎస్ రంగాపురం ప్రాంతానికి చెందిన జగదల నరేంద్రనాథ్ (32) ఐటీబీపీలో కానిస్టేబుల్‌గా (జీడీ)గా పనిచేస్తున్నాడు. 2014లో పోలీస్ శాఖలో చేరిన నరేంద్రనాథ్ గత 15 నెలలుగా 56వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు.అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అయితే శుక్రవారం గార్డు విధులు నిర్వర్తిస్తూ రాత్రి ఏడు గంటల ప్రాంతంలో బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌లోని మామిడి చెట్టుకు నైలాన్ వైర్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు బెటాలియన్ ఇన్‌చార్జి సూరజ్ ప్రకాష్‌జోషి ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి సీఐ చింతా వాసునాయుడు, ఎస్ఐ సంతోష్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. నరేంద్రనాథ్ కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతున్నాడని, గతంలో ఢిల్లీలో చికిత్స తీసుకున్నాడని తెలిసింది.

## బస్సులకు తాత్కాలిక బ్రేక్

... 5వ పేజీ తరువాయి

బస్సులు హైవే రన్నింగ్‌కు బాగుంటాయని అప్పటి అధికారులు స్టీల్ సిటీ డిపోనకు కేటాయించారు. ఇందులో 16 బస్సులను విజయనగరం, రెండు బస్సులు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్ రూట్లలో నడుపుతున్నారు.

### నిపుణుల పరిశీలన

నగరంలో శుక్రవారం ఒక బస్సు దగ్ధమైన నేపథ్యంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం బస్సుల సాంకేతికతను మెకానికల్ ఇంజనీర్ల బృందం శనివారం పరిశీలించింది. విజయవాడ నుంచి వచ్చిన ఆర్టీసీ సీనియర్ మెకానికల్ ఇంజనీర్లు శర్మ, మాధవ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (మెకానికల్) బ్రహ్మానందరెడ్డి శాంతిపురం జంక్షన్‌లో శుక్రవారం దగ్ధమైన బస్సును, స్టీల్‌సిటీ డిపోలో నిలిపి ఉంచిన బస్సులను క్షుణ్ణంగా పరిశీలించారు. వీరికి విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పద్మావతి, మెకానికల్ ఫోర్‌మన్, ఇద్దరు అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్లు బస్సుల పనితీరును వివరించారు.

## ఉత్సాహంగా బీచ్ కబడ్డీ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్స్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రో కబడ్డీ లీగ్‌లో ఆడుతున్న బెంగాల్ వారియర్స్ శనివారం ఆర్.కె. బీచ్ వద్ద స్కూల్ విద్యార్థులకు బీచ్ కబడ్డీ పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో చంద్రంపాలెం జెడ్పీ స్కూల్, గోపాలపట్నం ఎస్‌వీఎల్ఎన్ జెడ్పీ స్కూల్ నుంచి బాలురు, బాలికల జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. బాలురు, బాలికల విభాగాల్లో చంద్రంపాలెం జెడ్పీ స్కూల్ విన్నర్ ట్రోఫీలు కైవసం చేసుకోగా, గోపాలపట్నం జెడ్పీ స్కూల్ బాలురు, బాలికల జట్లు రన్నరప్‌గా నిలిచాయి. కాప్రి స్పోర్ట్స్ డైరెక్టర్, బెంగాల్ వారియర్స్ కెప్టెన్ దేవంక్ దలాల్, చీఫ్ కోచ్ నవీన్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీ అందజేసి అభినందించారు.విజేతగా నిలిచిన చంద్రంపాలెం జట్టు ఆటగాళ్లకు బెంగాల్ వారియర్స్ తలపడే మ్యాచ్‌ను వీక్షించేందుకు ఉచితంగా టికెట్లను అందజేసింది. అలాగే కబడ్డీ క్రీడలో రాణించే మెలకువలను చిన్నారులకు వివరించారు. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేసి ఉన్నత క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

## సమస్యలపై మంత్రి లోకేశ్‌కు వినతి



లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న స్థానిక నాయకులు

కొమ్మాది, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత కోరారు. శుక్రవారం ఆమె చంద్రంపాలెం వచ్చిన విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందించారు. రాజీవ్ గృహకల్పకాలనీ, మారికవలస, బోరవానిపాలెం, శారదానగర్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీల విద్యార్థులు చంద్రంపాలెం ఉన్నత పాఠశాలకు చేరుకోవాలంటే ఐదు కిలోమీటర్లు ప్రయాణించడంతో పాటు జాతీయ రహదారి దాటాల్సి వస్తుందన్నారు. ఈక్రమంలో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని వివరించారు. పాఠశాలలో నాడు -నేడు పథకం కింద చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేసి, ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని విన్నవించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

## అర్హులందరికీ పింఛన్లు

పద్మనాభం రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అర్హులైన ప్రతిఒక్కరికి పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపీడీఓ విజయకుమార్ తెలిపారు.శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నోటీసులు అందుకున్న వారికి కూడా ఈనెల యథావిధిగా పింఛన్లు ఇస్తామని చెప్పారు.

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆత్మీయ వీడ్కోలు

గోపాలపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలో జరిగిన జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి హాజరై తిరిగి ప్రయాణమైన ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు నాయకులు, అభిమానులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. శనివారం రాత్రి నగరం నుంచి రోడ్డు మార్గంలో విమానాశ్రయానికి చేరుకున్న పవన్‌కల్యాణ్ ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వెళ్లారు.

## ప్రమాదకరంగా విద్యార్థుల ప్రయాణాలు


సింహాచలంలో బస్సు వద్ద రద్దీ



డ్రైవర్ డోర్ నుంచి ఎక్కుతున్న విద్యార్థిని

సింహాచలం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం నుంచి పద్మనాభం, రెడ్డిపల్లి మీదుగా రాకపోకలు సాగించే బస్సుల్లో విద్యార్థులు ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. కంచరపాలెం, మర్రిపాలెం, గోపాలపట్నం, సింహాచలం, శొంఠ్యాం, హనుమంతువాక ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ప్రతి రోజూ సింహాచలం, విజయనగరం మధ్య తిరిగే బస్సుల్లో ప్రయాణాలు చేస్తుంటారు. ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు బస్సులు రద్దీగా ఉండడంతో విద్యార్థులు డోర్లపై వేలాడుతూ ప్రయాణాలు చేస్తున్నారు. సింహాచలం బస్టాండ్‌లో కొందరు బస్సులు ఎక్కేటప్పుడు డ్రైవర్ డోర్ తీసి మరీ ఎక్కుతున్నారు. అధికారులు స్పందించి విద్యార్థుల రద్దీ సమయంలో అదనపు సర్వీసులు నడపాలని పలువురు కోరుతున్నారు.

## తారకరామనగర్‌లో అన్నసమారాధన


కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

మధురవాడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెంలోని తారకరామనగర్‌లో సాయిశక్తి రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి మండపం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీసత్యనారాయణ మాట్లాడుతూ అన్నసమారాధనలో సుమారు 1200 మంది స్వామివారి ప్రసాదం స్వీకరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎండీ అనీషా ఆదిల్, ఉపాధ్యక్షుడు ఎస్. గణేష్, వైష్ణవి ఓల్డేజ్ హోం అధినేత వై. సత్యనారాయణ, అసోసియేషన్ ప్రతినిధులు నర్సింగ్ పట్నాయక్, మాధవీగణేశ్, ఆడారి కమలారమణ, మనోరమా తిరుపతిరావు, సునీత, సరిత, శివ, చిరంజీవి వర్మ, సుజాతా రంగారావు, కల్యాణి, ఉమా రామకృష్ణ, సురేఖా నాగరాజు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## కబ్జాదారులకు చెక్

... 5వ పేజీ తరువాయి

అధికారులకు ఫిర్యాదులు అందాయి. అలాగే గెడ్డ వాగు కబ్జా చేయడంతో వర్షాకాలంలో నీరు గ్రామంపైకి వస్తోందని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో తనకున్న పలుకుబడి ఉపయోగించుకుని ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేయించిన ప్రజా ప్రతినిధిపై ప్రస్తుత రెవెన్యూ అధికారులు విచారణకు నిర్ణయించారు. త్వరలో మరికొన్ని ఆక్రమణలను గుర్తించి స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు.

## డిసెంబరు 14న నేవీ మారథాన్

... 5వ పేజీ తరువాయి

21.097 కి.మీ (హాఫ్ మారథాన్), 10 కి.మీ. పరుగు, 5 కి.మీ. ఫన్ రన్ ఉంటాయన్నారు. వీటికి ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి వరకూ రేస్ మార్గాలు కూడా నిర్దేశించామన్నారు. దీనికి ముందు ప్రతి నెల రెండో ఆదివారం ఆర్‌కే బీచ్ రోడ్డులో ప్రోమో రన్నింగ్, కండిషనింగ్, స్ట్రెంగ్త్ ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, వైజాగ్ నేవీ మారథాన్ ఇది క్రీడా కార్యక్రమమే కాకుండా నగర ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు ఉపయోగపడే వేడుక అని పేర్కొన్నారు.


క్రేన్ సహకారంతో నిమజ్జనం


ఐస్‌తో ఏర్పాటు చేసిన శివలింగం

## జోడుగుళ్లపాలెం తీరంలో వినాయక నిమజ్జనాలు

విశాలాక్షినగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని జోడుగుళ్లపాలెం తీరంలో శనివారం రాత్రి వినాయక నిమజ్జనాలు జరిగాయి. మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించిన అనంతరం ప్రతిమలను నిమజ్జనం చేశారు. దీంతో జోడుగుళ్లపాలెం తీరం భక్తులతో సందడిగా మారింది. అధికారులు ఒక భారీ క్రేన్‌తో పాటు చిన్న క్రేన్ ఏర్పాటు చేశారు. వాటితో విగ్రహాలను నిమజ్జనం చేశారు. అలానే సుమారు 80 మంది గజ ఈతగాళ్లతో పాటు పోలీసుల గస్తీని పెంచారు.

### విశాలాక్షినగర్‌లో ఐస్‌తో శివలింగం

విశాలాక్షినగర్ రెవెన్యూ కూడలిలో ఉత్తమ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మండపం ఆవరణలో ఐస్‌తో శివలింగం ఏర్పాటు చేసి లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఐస్ శివలింగం చూడటానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

## ఘనంగా విజయ గణపతి కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎండాడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డులోని వైశాఖీ స్కైలైన్ అపార్ట్‌మెంట్ ఆవరణలో వినాయక ఉత్సవాల్లో భాగంగా శనివారం సిద్ధి బుద్ధి సమేత విజయ గణపతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం అపార్ట్‌మెంట్ ఆవరణలో ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ నివాసితులు సోమశేఖర్, రుద్ర వర్మ, రామయ్య చౌదరి, సుందరరావు, రాజాబాబు, తదితరులు పాల్గొన్నారు.

## సేనలో నూతనోత్సాహం

... 5వ పేజీ తరువాయి

లక్ష్యాలను నిర్దేశించడంతో పాటు వారిని నాయకులుగా తీర్చిదిద్దేందుకు తన వద్దనున్న ప్రణాళిక లను సుదీర్ఘంగా వివరించారు. వైసీపీ హయాంలో సాగించిన పోరాటాన్ని మననం చేసుకుంటూనే భవిష్యత్తులో పార్టీని ఎలా ముందుకు తీసుకువెళ్లాలనుకుంటున్నదీ వివరించారు. ఇందుకోసం కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలని, వారిని నాయకులుగా తీర్చిదిద్దే బాధ్యతను తాను తీసుకుంటానని, అందుకు పదేళ్ల సమయం పడుతుందని పవన్ స్పష్టం చేశారు. అధినేత ప్రసంగానికి జనసైనికులు, వీర మహిళలు ఆద్యంతం ఈలలు, చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ తరహా సభను కార్యకర్తలతో నిర్వహించడం, అది విజయవంతం కావడంతో పార్టీ నాయకులు, శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

### సభను ప్రారంభించిన వీర మహిళ

సాధారణంగా సభలను పార్టీ ముఖ్య నేతలు ప్రారంభిస్తారు. దానికి భిన్నంగా 'సేనతో సేనాని' సభను వీరమహిళ గోవిందమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నోవాటెల్ హోటల్‌లో పవన్‌ను దిగ్బంధించిన సమయంలో ఆమె మూడేళ్ల చంటి బిడ్డతో జనసేన జెండా పట్టుకుని రాత్రంతా దీక్ష చేసింది. సభా ప్రాంగణంలో మధ్యాహ్నం 4.22 గంటలకు ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమాలు సాయంత్రం 6.21 వరకు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. అదే సమయంలో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రాంగణానికి చేరుకున్నారు.

### పార్టీని బలోపేతం చేయాలి

తొలుత రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన పలువురు క్రియాశీలక కార్యకర్తలు సభలో ప్రసంగించారు. రమేష్ అనే కార్యకర్త మాట్లాడుతూ పిల్లసేన, కోతి సేన అన్నవారికి లంకా దహనం ఎలా ఉంటుందో చూపించామన్నారు. విశాఖ తూర్పు నియోజకవర్గానికి చెందిన కార్యకర్త శ్రీకాంత్ మాట్లాడుతూ అసాధ్యాలను సుసాధ్యం చేయడం జనసైనికులకు మాత్రమే సొంతమన్నారు. భీమవరానికి చెందిన విజయలక్ష్మి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో జనసేనకు విజయం దక్కలేదని, అయితే 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో తమ ప్రాంతంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, జడ్పీటీసీ సభ్యులు గెలుపొందడం ద్వారా సాధారణ ఎన్నికల్లో పార్టీ ఘన విజయానికి బాటలు వేశామన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలోని ప్రతి గుడిసెపై జనసేన జెండా ఎగురుతుందని ఆ ప్రాంతానికి చెందిన శివ అన్నారు. శ్రీకాకుళానికి చెందిన విష్ణు ప్రియాంక మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ వలనే ఉద్దానం సమస్య ప్రపంచానికి తెలిసిందని, అక్కడ ఇంకా అనేక సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించేందుకు కృషిచేయాలని కోరారు. అనంతరం ఆమె పవన్‌కు వినతిపత్రం ఇచ్చారు.

### కర్ణాటక జెండా, కండువాతో పవన్..

పవన్ వేదికపైకి రాగానే అభిమానులు ఈలలు, చప్పట్లతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు అభివాదం చేశారు. ఈ క్రమంలోనే కర్ణాటక నుంచి వచ్చిన పలువురు కార్యకర్తలు పెద్దఎత్తున కేకలు వేస్తూ తమ రాష్ట్ర అధికారిక జెండాలను ప్రదర్శించారు. వారిని చూసిన పవన్ కల్యాణ్ కర్ణాటక జెండా, జనసేన జెండాతో కలిపి పట్టుకుని, మెడలో కర్ణాటక రాష్ట్ర జెండా రంగుతో కూడిన కండువాను వేసుకున్నారు. అనంతరం ఒడిశా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారితోనూ పవన్ ఫొటోలు దిగారు. పవన్ కల్యాణ్ ప్రసంగం అనంతరం మత్స్యకారులు చేప, వల, పడవ చిత్రాన్ని ఆయనకు బహూకరించారు. పవన్ కల్యాణ్ చిత్రాన్ని పచ్చబొట్టు వేయించుకున్న మత్స్యకార యువకుడితో పవన్ ఫొటో దిగారు. అనంతరం మృతిచెందిన కార్యకర్తల కుటుంబసభ్యులకు చెక్కులను అందించారు.

## స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు ముఖ్యమంత్రి కృషి

... 5వ పేజీ తరువాయి

తీసుకుంటున్నారన్నారు. దీనిని కొంతమంది ప్రైవేటీకరణగా చిత్రీకరిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. గతంలో కొంతమంది కాంట్రాక్టర్‌లు, అధికారులు, కార్మిక నాయకులు కుమ్మక్కై లేని రెండు వేల మంది కాంట్రాక్టు కార్మికుల పేర్లను చూపించి జీతాలు దోచుకున్నారన్నారు. బయోమెట్రిక్ విధానం ప్రవేశపెట్టిన తరువాత అవకతవకలు బయపడ్డాయన్నారు. వెంటనే తప్పుడు పేర్లను తొలగించడం జరిగిందన్నారు. స్టీల్‌ప్లాంటు నిర్వాసితులకు అన్యాయం జరగదని, అందరికీ ఉపాధి కల్పించడానికి కృషి చేస్తున్నామని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల పోస్టుల్లో యాభై శాతం నిర్వాసితులకు కేటాయించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్లాంటులో ఈ నిబంధనను తప్పనిసరిగా పాటించాలన్నారు. నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మిగిలిన నిర్వాసితులకు కూడా ఉపాధి కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు. నిర్వాసిత కార్మికులు, సీనియర్ కాంట్రాక్టు కార్మికులను కాంట్రాక్టర్లు కొనసాగించాలన్నారు. నిర్వాసితులకు అన్యాయం జరగదని, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

## గొల్లల ఎండాడలో కుంకుమ పూజలు

ఎండాడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డులోని గొల్లల ఎండాడలో గోపాలకృష్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భాగస్వామ్యం కల్పిస్తే.. నకిలీ అభ్యర్థులను గుర్తిస్తాం

» అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నకిలీ కుల ధ్రువీకరణలను గుర్తించేందుకు గిరిజన సంఘాలను భాగస్వామ్యులను చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర చైర్మన్ యకశిరి వేంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కోరాబు సత్యనారాయణ, దీనారి ప్రభాకర్ ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ ఫలితాలను ప్రకటించడం హర్షణీయమని, అయితే సర్టిఫికేషన్ వెరిఫికేషన్ సమయంలో జిల్లాలో ఎస్టీ నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలలో చేరే అవకాశం ఉందని, కాబట్టి గిరిజన ఉద్యోగ సంఘాల ప్రతినిధులను పరిగణనలోకి తీసుకుంటే, నకిలీ అభ్యర్థులను గుర్తించడానికి అవకాశం ఉంటుందని కోరారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన ప్రకారం నూటికి నూరు శాతం గిరిజన ఉద్యోగులతో షెడ్యూల్ ప్రాంతంలో నియామకాలు చేస్తామన్నారని, జీవో వచ్చే వరకూ షెడ్యూల్ ప్రాంతాల నియామకాలను నిలుపుదల చేయాలని కోరారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో స్పెషల్ డీఎస్సీ రిక్రూట్‌మెంట్ చేయాలని కోరారు.

## గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో ఉచిత శిక్షణ

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో రెండు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లీష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ సమీపంలో కెనరా బ్యాంకు ఎదురుగా శ్రీకృష్ణ ట్రావెల్స్ మేడపైన ఉన్న సంస్థ కార్యాలయంలో సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి అక్టోబరు 31 వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 10 గంటలు నుంచి 11.30 గంటల వరకు రోజూ తరగతులు ఉంటాయన్నారు. శిక్షణకు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆసక్తి కలిగిన గృహిణులు ఇనిస్టిట్యూట్‌కు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ : 80193 88999లో సంప్రదించాలని కోరారు.

## రుషికొండపై దుష్ప్రచారం

» మాజీ మంత్రి అమర్‌నాథ్ డిమాండ్

మద్దిలపాలెం, ఆగస్టు (ఆంధ్రజ్యోతి) : రుషికొండపై భవనాలు జగన్ ప్యాలెస్ అని దుష్ప్రచారం చేసినందుకు కూటమి పార్టీలు క్షమాపణలు చెప్పాలని వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు రుషికొండపై జగన్ ప్యాలెస్ నిర్మాణం చేస్తున్నారని ప్రచారం చేసి, ఇప్పుడు అవి ప్రభుత్వ భవనాలేనని సమర్థించుకుంటున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన రుషికొండ రిసార్ట్స్ కూటమి నేతలకు పొలిటికల్ టూరిజం డిస్టినేషన్‌గా మారాయన్నారు. ఏ పార్టీ నాయకులు వచ్చినా రుషికొండ సందర్శించి సెల్ఫీలు తీసుకోవడం, మళ్లీ వైసీపీపై బురదచల్లడం అలవాటుగా చేసుకున్నారని ఎద్దేవా చేశారు.

## సినిమా గైడ్

● **పరదా** : శారద, శ్రీకన్య లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
● **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
● **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
● **యూనివర్సిటీ** : శ్రీకాంతి
● **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
● **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
● **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 38, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 36, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 50, బంగాళదుంపలు 18, అరటికాయ (పె) 10, మునక్కాడలు (కిలో) 58, అల్లం (పాతది) 74, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 86, కీరదోస 30, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

**కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)**

| | |
|---|---|
| విశాఖపట్నం | 560 |
| విజయనగరం | 564 |
| శ్రీకాకుళం | 564 |

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | |
|---|---|
| రైతు ధర | 113 |
| లైవ్ ధర | 133 |
| విత్ స్కిన్ | 236 |
| స్కిన్‌లెస్ | 246 |

# క్రమశిక్షణ పెంపొందించే చదరంగం

» పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి
» ఘనంగా అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ ప్రారంభం


చెస్ చాంపియన్‌షిప్ టోర్నీని ప్రారంభించిన పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు క్లబ్ వేదికగా ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఫిడే రేటింగ్ ర్యాపిడ్, బ్లిట్జ్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ టోర్నీ శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నీకి ముఖ్య అతిథిగా నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేయగా, ప్రత్యేక అతిథిగా బృహత్ నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గర్గ్ హాజరయ్యారు. పోలీసు కమిషనర్ బాగ్చి మాట్లాడుతూ చిన్నారులలో మేధస్సు, క్రమశిక్షణ పెంచే చెస్ క్రీడను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. చిన్నారుల నుంచి సీనియర్ల వరకు పోటీల్లో పాల్గొని ప్రతిభను ప్రదర్శించడం ఆనందదాయకమన్నారు. విశాఖ నుంచి అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనే క్రీడాకారులకు పాస్‌పోర్టు జారీలో తలెత్తే సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ సహకరిస్తుందని హామీ ఇచ్చారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గర్గ్ మాట్లాడుతూ దేశానికి ఖ్యాతి తెచ్చిన అనుభవ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. జీవీఎంసీ పాఠశాలల్లో చెస్ క్రీడకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన న్యాయవిశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఈ టోర్నీలో సుమారు 400 మంది పాల్గొనడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. వుమెన్ ఫిడే మాస్టర్, ఇంటర్నేషనల్ మాస్టర్ కొలగట్ల అలన మీనాక్షి, ఆర్వీ గ్రూప్ చైర్మన్ ఆర్.వెంకటేశ్వరరావు, వాల్తేరు క్లబ్ జి.శేషగిరిరావు, కార్యదర్శి సి.బాల సతీష్, ఆంధ్ర చెస్ సంఘం అధ్యక్షుడు ఎ.సురేష్, చైర్మన్ కె.వి.శర్మ తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు ఫలితాలు: తొలిరోజు ఆరు రౌండ్‌లు ముగిసే సరికి దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న డీఎస్ఎస్‌యూ.సాత్విక్, గొర్లి నైనా చెరో ఆరు పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలవగా, తలో 5.5 పాయింట్లతో ఎ.వి.ఎస్.విజయ్‌కుమార్, జి.రవికృష్ణ, మజ్జి రాంచరణ్ తేజ, గంపా ఆదిత్య వరుణ్, బి.రామన్ సిద్దార్థ రెండో స్థానంలో ఉన్నారు.

## తెలుగు సాహితీ చరిత్రలో ఆరుద్రది చెరగని ముద్ర

ఏయూ తెలుగు శాఖ విభాగాధిపతి జర్రా అప్పారావు


ఆరుద్రకు నివాళులు అర్పిస్తున్న ఆచార్య అప్పారావు, డీవీ సూర్యారావు, విద్యార్థులు

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహిత్య చరిత్రంలో ఆరుద్రది చెరగని ముద్ర అని ఏయూ తెలుగు శాఖ విభాగాధిపతి జర్రా అప్పారావు అన్నారు. ప్రముఖ రచయిత, పరిశోధకుడు, కవి ఆరుద్ర శతజయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏయూ తెలుగుశాఖలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆంధ్రా యూనివర్సిటీ, వేంకటేశ్వర యూనివర్సిటీ, తెలుగు విశ్వవిద్యాలయం ఆరుద్రకు కళాప్రపూర్ణ, డి.లిట్ పట్టా ఇచ్చి సత్కరించాయన్నారు. ఆరుద్ర రాసిన గ్రంథాలకు ఆంధ్రప్రదేశ్ అకాడమీ పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం వచ్చిందన్నారు.

తొలుత పలువురు ఆరుద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు ప్రాచార్యులు ఆచార్య ఎ.నరసింహారావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ దామెర వెంకటసూర్యారావు తదితరులు పాల్గొని మాట్లాడారు.

## ఎస్సీ కార్పొరేషన్ సిబ్బందితో చైర్మన్ సమీక్షా సమావేశం

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ ఎంవీపీ కాలనీలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సిబ్బందితో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యపద్మతో కలసి సమావేశంలో పలు అంశాలను చర్చించారు. షాపింగ్ కాంప్లెక్సులు, పౌల్ట్రీ కాంప్లెక్సులు, ఖాళీ స్థలాల అభివృద్ధి, ఏపీఎస్ ఆర్టీసీ హెవీ మోటార్ వాహనాల శిక్షణ, ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్కేఎఫ్‌డీసీ పథకాల అమలు, రికవరీ తదితర అంశాలపై చర్చించారు.

## చవితి పందిర్లలో అన్న సమారాధనలు


అన్నసమారాధనలో పాల్గొన్న వడ్డిస్తున్న ప్రతాప్‌రుద్ర

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా శనివారం వివిధ ప్రాంతాల్లో అన్నసమారాధన నిర్వహించారు. ఎంవీపీ కాలనీ సెక్టర్ 1, 3, ఆదర్శనగర్ ప్రాంతాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలకు ఎమ్మెల్యే వెలగపూడి తనయుడు, తెలుగుదేశం యువనాయకుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర హాజరై భోజనం వడ్డించారు. ఆయా పందిర్ల నుంచి గణేశ్ నిమజ్జనాన్ని ఆదివారం నిర్వహించనున్నారు.

## నేడు స్టీల్‌ప్లాంటు కార్మికుల మహా ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంటులో ఈవోఐలను నిరసిస్తూ ఆదివారం కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద మహా ధర్నా చేపట్టనున్నామని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు తెలిపారు. ఈవోఐల విషయంలో యాజమాన్యం వెనక్కితగ్గే వరకు పోరాటాలు చేస్తామని, వాటితో ప్లాంటు భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్నారు. యాజమాన్యంపై ఒత్తిడి పెంచేందుకు వీలుగా ఆదివారం ఉదయం 8 గంటలకు చేపట్టే మహా ధర్నాకు ఉక్కు ఉద్యోగులు, కార్మికులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

## మహిళా బిల్లు ఆమోదించాలి

» ఓబీసీ మహిళలకూ రిజర్వేషన్ కల్పించాలి
» రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకరరావు


కార్యక్రమంలో పాల్గొన్న శంకరరావు

సిరిపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : బీసీ మహిళలకు సబ్ కోటా ఇస్తూ మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణ చేసి మాత్రమే అమలు జరపాలని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, మహిళా విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు సంకార పు జయశ్రీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఒక రోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జయశ్రీ మాట్లాడుతూ గత 30 ఏళ్లగా కేంద్రంలో పలు ప్రభుత్వాలు మారినా, చట్ట సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదింపబడలేదన్నారు. కేవలం మూలాయం, లాలు, శరద్‌యాదవ్‌లు మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు సబ్ కోటా తేల్చాలని పట్టుబట్టడం వలనే బిల్లును 30 ఏళ్లపాటు అటకెక్కించారన్నారు. ఎట్టకేలకు 33 శాతంతో మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆమోదించడం హర్షణీయమన్నారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ అనాదిగా ఓబీసీలు భారతీయ మనువాద సమాజంలో సామాజిక అణచివేతకు గురవుతున్నారన్నారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లతో కేంద్రం ఆమోదించిన మహిళా చట్టానికి , బీసీ మహిళకు సబ్ కోటానిస్తూ సవరణ చేసి మాత్రమే అమలు జరపాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాస్, ఉత్తరాంధ్ర కన్వీనర్ గొర్లె శ్రీనివాస్‌నాయుడు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పల్లా రమణ యాదవ్, నగర అధ్యక్షులు బోసు , బుద్దా చంద్రవాణి, పల్లా రమణ, పేడాడ సూర్యకుమారి, ప్రజా, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### జీవీఎంసీ రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

సిరిపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో ఎంతో బాధ్యతగా సుదీర్ఘకాలం ఉద్యోగ విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న ప్రతి ఒక్కరి శేష జీవితం ఆనందదాయకంగా ఉండాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి ఆకాంక్షించారు. శనివారం జీవీఎంసీ వివిధ హోదాలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న జీవీఎంసీ డీపీఓ ఎల్.సురేష్‌తో కలిసి సన్మానించారు.

## ప్రత్యేక అవసరాల విద్యార్థులకు అనువైన విద్యాబోధన అవసరం : ఏయూ వీసీ


స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన పుస్తకం ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ జీపీ రాజశేఖర్

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించి వారికి అనువైన బోధన, అభ్యసన విధానాలు అమలు చేయడం ఎంతో అవసరమని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ జీపీ రాజశేఖర్ అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో మూడు రోజుల పాటు జరిగిన ఎన్ఈపీ 2020 విత్ స్పెషల్ రిఫరెన్స్ టు స్పెషల్ ఎడ్యుకేషన్ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలానుగుణంగా విద్యా విధానం మార్పులకు లోనవుతుందని, నూతన బోధన విధానాలు సాంకేతికతలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. వీటిపై అవగాహన పెంచుకోవడం అందుకు అనుగుణంగా విద్యార్థులకు బోధన చేయడం ఎంతో అవసరమన్నారు. అదే సమయంలో ప్రత్యేక విద్యను బోధించేవారు నిరంతరం తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విద్యావిభాగాధిపతి టి.షారోన్‌రాజు, తదితరులు పాల్గొని మాట్లాడారు.

## ‘పెద్దలు మనకు మార్గదర్శకులు’


గ్రాండ్ పేరెంట్స్ డేలో పాల్గొన్న ఆచార్య జీఎస్ఎన్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆరిలోవ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రగతికి ఒక మార్గదర్శకం మన పెద్దలు అని సెంచూరియన్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. విశాఖ వ్యాలీ స్కూలులో శనివారం నిర్వహించిన గ్రాండ్ పేరెంట్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన వారసత్వ సంపద మన పెద్దలు అని, వారి నుంచి ప్రేమ, ఆప్యాయతానురాగాలు, మార్గదర్శనం అందించే గొప్ప చోదక శక్తులని పేర్కొన్నారు. కుటుంబ బాంధవ్యాలు, మానవ సంబంధాల గురించి చిన్నారులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరీ ప్రభాకర్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మన కుటంబ వ్యవస్థ గురించి చిన్నారులకు తెలియజేసేందుకు ప్రతిఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు, కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పీఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో సాంస్కృతిక కృతక్ విద్యాలయ ఏడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. పన్నెండు నృత్యాలకు 27 మంది నృత్య కళాకారిణులు అద్భుత అభినయంతో ప్రదర్శించిన కథక్ నృత్యాలు ఆకట్టుకున్నాయి. నయోషా, నిహీరా ఉత్తర, నిహీరాలు గణేష్ వందనంతో నృత్యాలు ప్రారంభించారు. శ్రీసంజన, సాయి సంజన ప్రదర్శించిన శివస్తుతి నృత్యాలకు ఆడిటోరియం కరతాళధ్వనులతో మారుమోగింది.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ గురుహరి రామ్మూర్తి మాట్లాడుతూ సమాజంలో చదువుతో పాటు కళలను కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. వాడ ప్రధాన కార్యదర్శి కన్నం వెంకటరమణారావు మాట్లాడుతూ నగరంలో గత ఏడు సంవత్సరాలుగా 700 మంది కథక్ నృత్యకళాకారుణలను తయారు చేయడంలో సాంస్కృతిక కృతక్ విద్యాలయ ప్రిన్సిపాల్ క్రితా కరుణి సేవలు అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో డాక్టర్ ఏఎఆర్ సత్యనారాయణ, విద్యాలయ ఫౌండర్ డైరెక్టర్ క్రితా కరుణి, నృత్య కళాకారిణులు పాల్గొన్నారు.

## హార్బర్ ఆధునికీకరణ వేగవంతం చేయాలి

» మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్


ఆధునికీకరణ పనుల గురించి తెలుసుకుంటున్న మత్స్య శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, పాల్గొన్న అధికారులు


ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులతో మాట్లాడుతున్న కమిషనర్ ఆర్ఎస్ నాయక్

బీచ్ రోడ్డు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఫిషింగ్ హార్బర్‌లో ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలని మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్ ఆదేశించారు.. శనివారం ఆయన ఫిషింగ్ హార్బర్‌లో జరుగుతున్నఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాఖ పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో రూ.178 కోట్లతో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. కొత్తగా నిర్మిస్తున్న ఫిషింగ్ జెట్టీలు, వేలం కేంద్రాలు, ఈటీపీ, పార్కింగ్ బిల్డింగ్, నెట్ మెండింగ్ హాల్స్ స్టోరేజీ నిర్మాణాలను పరిశీలించారు. అదేవిధంగా సీఎంఎఫ్ఆర్ఐలో గల సీకేజ్, సీవీడ్ రాఫ్టలు పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు, శాస్త్రవేత్త డీపీఎం కృష్ణ, రితీష్, ఎఫ్‌డీవోలు ఆశాజ్యోతి, మురళి, పోర్టు ఇంజనీరింగ్ శాఖ అధికారులు, బోట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం.లక్ష్మణరావు, సీహెచ్ వీర్రాజు, పీసీ అప్పారావు, బి.కొండలరావు, ఎం.ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

## యూత్‌ఫెస్ట్‌లో కృష్ణా కళాశాల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బి.సుజాత

మద్దిలపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి యూత్ ఫెస్ట్-25లో డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా బహుమతులు గెలుచుకున్న విద్యార్థులకు ప్రిన్సిపాల్ బి.సుజాత అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన యూత్ ఫెస్ట్‌లో ఎయిడ్స్‌పై నిర్వహించిన క్విజ్ పోటీల్లో తమ కళాశాలలలో చదువుతున్న నలుగురు విద్యార్థులు బహుమతులు పొందారన్నారు. పోటీ అంశాల్లో అవగాహన పెంచుకొని ఉత్తమ విద్యార్థులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.సన్యాసిరావు, ఆర్పీ నాయుడు, వేదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయంలో శనివారం విఘ్నగణపతిగా అలంకరణ -ఆంధ్రజ్యోతి, సీతంపేట



ఆంధ్రజ్యోతి కార్యాలయం సమీపంలోని ఆలయంలో నవనీత గణపతిగా అలంకరణ -ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

## రైతుబజార్‌లో అన్నదానం



సీతమ్మధారలో వడ్డిస్తున్న రైతులు, సిబ్బంది

సీతమ్మధార, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార రైతుబజార్‌లో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రైతు బజార్ల నుంచి రైతులు, ఎస్టేట్ అధికారులు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మార్కెట్ అధికారులు, ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి, నారాయణ, షర్మిల, సతీష్ పాల్గొన్నారు.

## ఐటీబీపీ హెడ్ క్వార్టర్స్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య



నరేంద్రనాథ్ (ఫైల్)

ఆనందపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం మండలం పందలపాక సమీపంలోని 56వ ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) బెటాలియన్ హెడ్ క్వార్టర్స్‌లో ఒక కానిస్టేబుల్ (జీడీ) శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్టు సీఐ చింతా వాసునాయుడు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా డోన్ మండలం ఆర్ఎస్ రంగాపురం ప్రాంతానికి చెందిన జగదల నరేంద్రనాథ్ (32) ఐటీబీపీలో కానిస్టేబుల్‌గా (జీడీ)గా పనిచేస్తున్నాడు. 2014లో పోలీస్ శాఖలో చేరిన నరేంద్రనాథ్ గత 15 నెలలుగా 56వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అయితే శుక్రవారం గార్డు విధులు నిర్వర్తిస్తూ రాత్రి ఏడు గంటల ప్రాంతంలో బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌లోని మామిడి చెట్టుకు నైలాన్ వైర్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు బెటాలియన్ ఇన్‌చార్జి సూరజ్ ప్రకాష్‌జోషి ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి సీఐ చింతా వాసునాయుడు, ఎస్ఐ సంతోష్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. నరేంద్రనాథ్ కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతున్నాడని, గతంలో ఢిల్లీలో చికిత్స తీసుకున్నాడని తెలిసింది. నెల రోజుల కిందట ఒకసారి ఆత్మహత్యకు యత్నించినట్టు సమాచారం.

## గిడుగుకు ఘననివాళి

సీతంపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గ్రాంధిక భాషలో ఉన్న తెలుగును జనులందరి వాడుక భాషలోకి తేవడానికి గిడుగు వెంకట రామమూర్తి చేసిన కృషి అనిర్వచనీయమని, ప్రతి పనిని ఆయన ఇష్టంతో చేసేవారని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల సెక్రటరీ డాక్టర్ జి.మధుకుమార్ అన్నారు. బుల్లయ్య కళాశాలలో తెలుగు భాషాదినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి అధ్యాపకులు నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎస్‌కే చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, గౌసీ బాబు, శ్రీనివాసరెడ్డి, రమణమూర్తి, జూనియర్, ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సోమేశ్వరరెడ్డి, దీపక్ చౌదరి, తెలుగు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కబ్జాదారులకు చెక్

... 5వ పేజీ తరువాయి

అధికారులకు ఫిర్యాదులు అందాయి. అలాగే గెడ్డ వాగు కబ్జా చేయడంతో వర్షాకాలంలో నీరు గ్రామంపైకి వస్తోందని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో తనకున్న పలుకుబడి ఉపయోగించుకుని ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేయించిన ప్రజా ప్రతినిధిపై ప్రస్తుత రెవెన్యూ అధికారులు విచారణకు నిర్ణయించారు. త్వరలో మరికొన్ని ఆక్రమణలను గుర్తించి స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు.

# ఇళ్ల వద్ద స్మార్ట్ కార్డుల పంపిణీ...తూచ్!

మురళీనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జారీ చేసిన కొత్త స్మార్ట్ కార్డుల కోసం రేషన్‌కార్డుదారులు హైరానా పడుతున్నారు. మొదట ఈ నెల 24న ఏఎస్‌ఓ కార్యాలయం నుంచి అన్ని రేషన్ డిపోలకు చేరిన కార్డులను రెండు రోజుల తర్వాత సచివాలయాలకు పంపారు. అక్కడితో డీలర్లు తమది కాదన్నట్టు మిన్నకుండిపోయారు. సచివాలయాల వద్ద ఈ నెల 27న నాయకులు లాంఛనంగా కొద్దిమందికి పంపిణీ చేశారు. తర్వాత ఇంటింటికీ సచివాలయ సిబ్బంది వెళ్లి కార్డులు అందిస్తారని ప్రకటించారు. 28, 29 తేదీల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలోని కొన్ని సచివాలయాల్లో మాత్రమే వీటిని అందించారు. మిగిలిన సచివాలయ సిబ్బంది జాబితా తమ వద్ద ఉండదని, కార్డులు రేషన్ డిపోల్లోనే తీసుకోవాలని సూచించడంతో స్మార్ట్ కార్డుల కోసం సచివాలయాలు, రేషన్ డిపోలకు తిరుగుతున్నారు. శనివారం సచివాలయ కార్యదర్శులు డీలర్ల చేతికే కార్డులిచ్చారు. ఇళ్ల వద్దకే వచ్చి ఇస్తారన్న మాటలు గాల్లో కలిసిపోయాయి. ఎండా వానల్లో డిపోల వద్దే క్యూలైన్లు కట్టి వృద్ధులు సైతం తీసుకోవాల్సి వచ్చింది. బర్మాక్యాంప్ 527వ రేషన్ డిపో వద్ద కార్డుల కోసం రోజంతా నానా ప్రయాస పడి తీసుకెళ్లారు. వారు చెప్పిన చోట, చెప్పిన సమయానికి వస్తేనే కార్డు అందుతుంది. లేదంటే మరో రోజు రండి.. అనే సమాధానమే! మరోపక్క మర్రిపాలెం ప్రాంతంలో 299వ సచివాలయంలో మాకు సచివాలయంలోనే అందించాలని సూచించారని అందరు కార్యదర్శులు అక్కడికే జనాన్ని పిలిపించి కార్డులు అందించారు. సచివాలయానికి చేరిన కార్డుదారులతో 299వ వార్డు సచివాలయం రోజంతా కిక్కిరిసింది. ఒక్కో చోట ఒక్కో విధంగా పంపిణీ జరుగుతుండటంతో వినియోగదారులు తికమకపడుతున్నారు. డిపో డీలర్లను వాకబు చేయగా, తమ వద్ద కార్డులు ఉండవన్న సమాధానం వినవస్తోంది. సచివాలయాలకు వెళ్తే కార్డులు డిపోలకు వస్తాయని, ఇంటింటికీ వచ్చి ఇస్తారని చెబుతుండటంతో వారం రోజులైనా, ఇప్పటికీ కార్డుల పంపిణీ 20 శాతం కూడా పూర్తి కాలేదు. పైగా ఆగస్టు 31, సెప్టెంబరు 1, 2 తేదీల్లో పెన్షన్ పంపిణీ బాధ్యతలు ఉంటాయని, కార్డులు ఇవ్వలేమని సచివాలయ కార్యదర్శులు సెలవిస్తున్నారు. తామంతా కొత్తగా బదిలీపై గత నెలలోనే వచ్చినందున, సచివాలయ పరిధి నివాసాలపైనా, మ్యాపింగ్, క్లస్టర్ వివరాలు అయోమయంగా ఉన్నాయని కార్యదర్శులు పేర్కొంటున్నారు. ఈ తతంగం ఇలా సాగుతున్నా, సివిల్ సప్లయిస్ అధికారులు, రెవెన్యూ చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నారు. స్పష్టమైన మార్గదర్శకాలు లేవు. కొన్ని చోట్ల కార్డులను అందిస్తున్న రేషన్ డీలర్లు స్మార్ట్ కార్డుల జారీకి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.



బర్మాక్యాంప్ 527 డిపో వద్ద కొత్త రేషన్ కార్డుల కోసం క్యూ కట్టిన కార్డుదారులు

### ఎక్కడికి వెళ్లాలో..ఎవరిస్తారో తెలియడం లేదు!

నా కార్డు మ్యాపింగ్ వివరాలు తెలుసుకోవడానికి నాలుగు రోజులుగా తిరుగుతున్నాను. సచివాలయానికి వెళ్తే అక్కడ కార్డులు లేవన్నారు. మీది 100వ నంబరు డిపో. అక్కడికే వెళ్లి అడగండి అని 282వ సచివాలయంలో సిబ్బంది చెప్పారు. డీలరు చిరునామా తెలీదు. మొత్తానికి ఆ డీలరు ఫోన్ నంబరు తెలుసుకుని వాకబు చేస్తే ఆయన పెందుర్తి ఎన్టీఆర్ జంక్షన్ దగ్గరకు వచ్చి ఫోన్ చేయాలని సూచించారు. అక్కడికి వెళ్లినా కార్డు ఉంటుందో లేదో... తెలీదు. ఎక్కడా సచివాలయాల్లో కార్డుదారుల వివరాలు తెలియజేసేలా జాబితాలు ప్రదర్శించడం లేదు. బోర్డుల్లో ఎలాంటి వివరాలు పెట్టడం లేదు. ఎటు పోవాలో తెలీక కార్డుదారులు గందరగోళంలో ఉన్నారు. మాది బర్మాక్యాంప్‌లో ఇల్లు.. కార్డు పెందుర్తి 100వ నంబరు డిపోలో ఉంది

- బంకపల్లి శివప్రసాద్, బర్మాక్యాంప్

## ఉత్సాహంగా బీచ్ కబడ్డీ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రో కబడ్డీ లీగ్‌లో ఆడుతున్న బెంగాల్ వారియర్స్ శనివారం ఆర్.కె. బీచ్ వద్ద స్కూల్ విద్యార్థులకు బీచ్ కబడ్డీ పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో మధురవాడ చంద్రంపాలెం జెడ్పీ స్కూల్, గోపాలపట్నం ఎస్‌వీఎల్ఎన్ జెడ్పీ స్కూల్ నుంచి బాలురు, బాలికల జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఈ టోర్నీలో బాలురు, బాలికల విభాగాల్లో చంద్రంపాలెం జెడ్పీ స్కూల్ విన్నర్ ట్రోఫీలు కైవసం చేసుకోగా, గోపాలపట్నం జెడ్పీ స్కూల్ బాలురు, బాలికల జట్లు రన్నరప్‌గా నిలిచాయి. ముగింపు కార్యక్రమంలో కాప్రి స్పోర్ట్సు డైరక్టర్, బెంగాల్ వారియర్స్ కెప్టెన్ దేవంక్ దలాల్, చీఫ్ కోచ్ నవీన్‌కుమార్ ముఖ్య అతిథులుగా విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. విజేతగా నిలిచిన చంద్రంపాలెం జట్టు ఆటగాళ్లకు బెంగాల్ వారియర్స్ తలపడే మ్యాచ్‌ను వీక్షించేందుకు ఉచితంగా టికెట్లను అందజేసింది. అలాగే కబడ్డీ క్రీడలో రాణించే మెలకువలను చిన్నారులకు వివరించారు. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేసి ఉన్నత క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బెంగాల్ వారియర్స్ ఆటగాళ్లు జాంగ్ కున్ లీ, విశ్వాస్ పాల్గొన్నారు.



విజేత ట్రోఫీ అందుకుంటున్న చంద్రంపాలెం బాలుర జట్టు



బాలికల విభాగంలో విజేతగా చంద్రంపాలెం క్రీడాకారిణులు

## ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులు



శిక్షణ కార్యక్రమంలో సూచనలు చేస్తున్న ప్రధానోపాధ్యాయిని రాజ్యలక్ష్మి

కంచరపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులని, నిత్యం నేర్చుకుంటూ పాఠ్యాంశాలు బోధిస్తుంటారని జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ఆర్పీపేట క్లస్టర్ ఉపాధ్యాయులకు ఆగస్టు నెలకు సంబంధించిన ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తేజకరమైన బోధన అందించాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించి చిన్నారులు పాఠశాలలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాలని కోరారు. అనంతరం పాఠశాలల వారీగా సి, డి.. గ్రేడుల పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి అభ్యసన సామర్థ్యాలు పెంచాలన్నారు. అనంతరం ఒకటి, రెండు తరగతులు,మూడు నుంచి ఐదు తరగతులకు వేర్వేరుగా శిక్షణ ఇచ్చారు. సబ్జెక్టు ఉపాధ్యాయులకు నిపుణుల ద్వారా ఆన్‌లైన్ శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ పరిధిలోని 8 పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్వయం నిర్ణయాత్మక శక్తితోనే మహిళా సాధికారత

» సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకల్లో డాక్టర్ సరిత సూచన



స్వాగత వేడుకలు ప్రారంభిస్తున్న అతిథులు

జ్ఞానాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో స్వయం నిర్ణయాత్మక శక్తి పెరిగినప్పుడే సాధికారిత పొందినట్లని గీతం యూనివర్శిటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ డా.పి.సరిత పేర్కొన్నారు. స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం 68వ స్టూడెంట్ కౌన్సిల్ ఫ్రెషర్స్ డే (స్వాగత) వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె విద్యార్థినులకు భవిష్యత్తు, సవాళ్లు, ఉద్యోగ అవకాశాలపై దిశానిర్దేశం చేశారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన డా.సరిత వేడుకలను ప్రారంభించారు. నూతన విద్యార్థులను స్వాగతిస్తూ ఏటా వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ తెలిపారు. అనంతరం విద్యార్థినులు శాస్త్రీయ, పాశ్చాత్య, జానపద నృత్యాలు చేశారు. పాటలు, మూకాభినయంతో ఆహూతులను అలరించారు. మిస్ ఫ్రెషర్ విభాగంలో డిగ్రీలో అమృతా ఖ్యాతి, ప్రగ్య రాణి, ఇంటర్మీడియట్‌లో జమీల ఖతూన్, అనుష్క విజేతలుగా నిలిచారు. వీరిని ప్రిన్సిపాల్ కిరీటాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సలహాదారులు డాక్టర్ సుజాత, సోనీ, డాక్టర్ మౌనవి, ప్రమీల, సిస్టర్ దిపాలి, ప్రత్యూష, డాక్టర్ కోటేశ్వర్, డాక్టర్ ప్రవీణ్, ఊర్మిళ, డా.పీకే జయలక్ష్మి పాల్గొన్నారు.




వేడుకల్లో ఉత్సాహంగా స్టెప్పులేస్తున్న విద్యార్థినులు

## ఉత్సాహంగా జాతీయ క్రీడా దినోత్సవం

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని వాల్తేరు రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. టీసీఎఫ్ఏ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొని ముందుగా హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోర్టు అథారిటీ రిటైర్డ్, జాతీయ ఫుట్‌బాల్ మాజీ క్రీడాకారుడు శేషుమోహన్, రైల్వేస్ ఫుట్‌బాలర్ శాస్త్రి, రిటైర్డ్ రైల్వేస్ సన్యాసిరావు, శంకరరావులను టీసీఎఫ్ఏ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాల్తేరు రైల్వే ఫుట్‌బాల్ కోచ్ కన్నబాబు, మాజీ కోచ్ కె.తిరుమలరావు, పోర్టు ఫుట్‌బాలర్లు పి.అప్పారావు, తిరుమలరావు, ఎస్.కె.ఖరీం, హెడ్ కానిస్టేబుల్ రవి, మసీనా, సైదిల్‌బాబు, గంగ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌జీజీఓస్ కాలనీ ఉన్నత పాఠశాలలో..

అక్కయ్యపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని శనివారం ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి, వ్యాయామ ఉపాధ్యాయురాలు యు.ఎన్. రత్నంల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 26వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్ హాజరై నెల రోజుల క్రితం నుంచి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రోటరీ క్లబ్ సురభి అధ్యక్షురాలు టి.సత్యశ్రీ లక్ష్మీ దేవి, సెక్రటరీ ఎం.ఎస్.ఎ. శ్రీహర్ష, డి. అరుణ సందీప్ ు పాల్గొన్నారు.



సీనియర్ ఫుట్‌బాలర్లను సత్కరించిన టీసీఎఫ్ఏ ప్రతినిధులు

## జిల్లా కోర్టులో న్యాయవిజ్ఞాన సదస్సు




ప్రసంగిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు

డాబాగార్డెన్స్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలు, తెగల వారికి చట్టపరమైన హక్కులు, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం (1989)లోని నిబంధనలు, అత్యాచారాల రకాలు, నేరస్తులకు విధించే శిక్షలు, బాధితులకు అందే న్యాయ సహాయం గురించి వివరించారు. బాలికల విద్యకు ప్రాధాన్యత, విద్య ద్వారా స్వయం సమృద్ధి అంశాలపై మాట్లాడారు. ఈ సదస్సులో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు కె.రామారావు, డీడబ్ల్యూసీడబ్ల్యూ అండ్ ఈఓ కేవీ రామలక్ష్మి, బి.సురేష్‌కుమార్, ఆర్.రమేష్, బి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం



విజయనగరం యార్డులో సూచనలిస్తున్న రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శనివారం విజయనగరం స్టేషన్ యార్డులో తనిఖీలు చేపట్టారు. ట్రాక్ నిర్వహణ, సిగ్నలింగ్ విధానంలో చేపడుతున్న భద్రత చర్యలను పరిశీలించారు. అనంతర స్టేషన్‌లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో పలు అంశాలపై సమీక్షించారు. భద్రతకు ప్రాధాన్యమివ్వాలని, ప్రయాణికులకు మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ వద్దని సూచించారు. సాంకేతికతపై అవగాహన పొంది ముందుకు సాగాలన్నారు. భద్రత పెంపునకు ఆధునికీకరణ పద్ధతులు పాటించాలని సూపర్‌వైజర్లకు సూచించారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా, వివిధ శాఖల అధికారలు పాల్గొన్నారు.

## షెల్టర్ హోమ్‌లో ఆధార్ నమోదు కేంద్రం



ఆధార్ నమోదును పరిశీలిస్తున్న సీపీ బాగ్చి

అక్కయ్యపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనర్ (సీపీ) తలపెట్టిన 'మిషన్ తమసోమ జ్యోతిర్గమయ' కార్యక్రమంలో భాగంగా ఏయూటీడీ జీవీఎంసీ షెల్టర్ హోంలలో వసతి కల్పించిన 210 మంది నిరాశ్రయులలో 128 మంది యాచకులు, మానసిక రోగులకు ఆధార్ నమోదు చేయడానికి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతిగృహంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలిముద్రల ఆధారంగా ఎవరికైనా ఆధార్ ఉంటే అందులో ఉన్న చిరునామా తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించడానికి, మిగిలిన వారికి ఆధార్ కార్డులు ఇప్పించి పింఛన్లు మంజూరు వంటి ప్రభుత్వ పథకాలు పొందేలా పునరావాసం కల్పించే ఉద్దేశంతో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెపారు. ఈ కార్యక్రమంలో ఆధార్ సెంటర్ మేనేజర్ బాల సుబ్రహ్మణ్యన్, ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, కంట్రోల్ రూం సీఐలు హుస్సేన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబరు 14న నేవీ మారథాన్

... 5వ పేజీ తరువాయి

21.097 కి.మీ (హాఫ్ మారథాన్), 10 కి.మీ. పరుగు, 5 కి.మీ. ఫన్ రన్ ఉంటాయన్నారు. వీటికి ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి వరకూ రేస్ మార్గాలు కూడా నిర్దేశించామన్నారు. దీనికి ముందు ప్రతి నెల రెండో ఆదివారం ఆర్‌కే బీచ్ రోడ్డులో ప్రోమో రన్నింగ్, కండిషనింగ్, స్ట్రెంగ్త్ ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, వైజాగ్ నేవీ మారథాన్ ఇది క్రీడా కార్యక్రమమే కాకుండా నగర ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు ఉపయోగపడే వేడుక అని పేర్కొన్నారు.

## పారదర్శకంగా బార్‌ల కేటాయింపు ప్రక్రియ

... 5వ పేజీ తరువాయి

సమక్షంలో లాటరీ తీసి బార్లను కేటాయించారు. జిల్లాలో 131 బార్‌లకు (రిజర్వ్ 10+ఓపెన్ 121) 263 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించి గీత కులాలకు పది, జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 57 బార్‌లను కేటాయిస్తూ నూతన బార్ పాలసీ నిబంధనల ప్రకారం లాటరీ ప్రక్రియను నిర్వహించారు. ఈ ప్రక్రియలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు. దరఖాస్తులు రాక మిగిలిపోయిన బార్ విషయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలియజేశారు.

## అంతా ఒకే మాటపై ఉండాలి

... 5వ పేజీ తరువాయి

వినియోగంలోకి తీసుకువస్తామని ప్రకటించారు. అనంతరం బే వ్యూ హోటల్‌లో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ఆగిందని, అయినప్పటికీ కొంతమంది కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, దానిని తిప్పికొట్టాలని నాయకులకు పిలుపునిచ్చారు. కూటమిలో విభేదాలు వద్దని, అది పార్టీతో పాటు రాష్ట్రానికి తద్వారా ప్రజలకు కూడా నష్టమని స్పష్టంచేశారు. ఇంకో పదిహేనేళ్లు కూటమితో కలిసి ప్రయాణం చేయాల్సి ఉందని స్పష్టంచేశారు. ఈ సమావేశాల నిర్వహణకు 12 కమిటీలను వేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, డీసీసీబీ అధ్యక్షుడు కోన తాతారావు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

## జేఎన్ఎన్‌యూఆర్ఎం బస్సులకు తాత్కాలిక బ్రేక్

... 5వ పేజీ తరువాయి

బస్సులు హైవే రన్నింగ్‌కు బాగుంటాయని అప్పటి అధికారులు స్టీల్‌సిటీ డిపోనకు కేటాయించారు. ఇందులో 16 బస్సులను విజయనగరం, రెండు బస్సులు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్ రూట్లలో నడుపుతున్నారు.

### నిపుణుల పరిశీలన

నగరంలో శుక్రవారం ఒక బస్సు దగ్ధమైన నేపథ్యంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం బస్సుల సాంకేతికతను మెకానికల్ ఇంజనీర్ల బృందం శనివారం పరిశీలించింది. విజయవాడ నుంచి వచ్చిన ఆర్టీసీ సీనియర్ మెకానికల్ ఇంజనీర్లు శర్మ, మాధవ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (మెకానికల్) బ్రహ్మానందరెడ్డిలు శాంతిపురం జంక్షన్‌లో శుక్రవారం దగ్ధమైన బస్సును, స్టీల్‌సిటీ డిపోలో నిలిపి ఉంచిన బస్సులను క్షుణ్ణంగా పరిశీలించారు. వీరికి విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పద్మావతి, మెకానికల్ ఫోర్‌మన్, ఇద్దరు అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్లు బస్సుల పనితీరును వివరించారు.

## స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు ముఖ్యమంత్రి కృషి

... 5వ పేజీ తరువాయి

తీసుకుంటున్నారన్నారు. దీనిని కొంతమంది ప్రైవేటీకరణగా చిత్రీకరిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. గతంలో కొంతమంది కాంట్రాక్టర్‌లు, అధికారులు, కార్మిక నాయకులు కుమ్మక్కై లేని రెండు వేల మంది కాంట్రాక్టు కార్మికుల పేర్లను చూపించి జీతాలు దోచుకున్నారన్నారు. బయోమెట్రిక్ విధానం ప్రవేశపెట్టిన తరువాత అవకతవకలు బయపడ్డాయన్నారు. వెంటనే తప్పుడు పేర్లను తొలగించడం జరిగిందన్నారు.

స్టీల్‌ప్లాంటు నిర్వాసితులకు అన్యాయం జరగదని, అందరికీ ఉపాధి కల్పించడానికి కృషి చేస్తున్నామని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల పోస్టుల్లో యాభై శాతం నిర్వాసితులకు కేటాయించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్లాంటులో ఈ నిబంధనను తప్పనిసరిగా పాటించాలన్నారు. నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మిగిలిన నిర్వాసితులకు కూడా ఉపాధి కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు. నిర్వాసిత కార్మికులు, సీనియర్ కాంట్రాక్టు కార్మికులను కాంట్రాక్టర్లు కొనసాగించాలన్నారు. నిర్వాసితులకు అన్యాయం జరగదని, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

# సేనలో నూతనోత్సాహం

... 5వ పేజీ తరువాయి

లక్ష్యాలను నిర్దేశించడంతో పాటు వారిని నాయకులుగా తీర్చిదిద్దేందుకు తన వద్దనున్న ప్రణాళిక లను సుదీర్ఘంగా వివరించారు. వైసీపీ హయాంలో సాగించిన పోరాటాన్ని మననం చేసుకుంటూనే భవిష్యత్తులో పార్టీని ఎలా ముందుకు తీసుకువెళ్లాలనుకుంటున్నదీ వివరించారు. ఇందుకోసం కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలని, వారిని నాయకులుగా తీర్చిదిద్దే బాధ్యతను తాను తీసుకుంటానని, అందుకు పదేళ్ల సమయం పడుతుందని పవన్ స్పష్టం చేశారు. అధినేత ప్రసంగానికి జనసైనికులు, వీర మహిళలు ఆద్యంతం ఈలలు, చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ తరహా సభను కార్యకర్తలతో నిర్వహించడం, అది విజయవంతం కావడంతో పార్టీ నాయకులు, శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

### సభను ప్రారంభించిన వీర మహిళ

సాధారణంగా సభలను పార్టీ ముఖ్య నేతలు ప్రారంభిస్తారు. దానికి భిన్నంగా 'సేనతో సేనాని' సభను వీరమహిళ గోవిందమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నోవాటెల్ హోటల్‌లో పవన్‌ను దిగ్బంధించిన సమయంలో ఆమె మూడేళ్ల చంటి బిడ్డతో జనసేన జెండా పట్టుకుని రాత్రంతా దీక్ష చేసింది. సభా ప్రాంగణంలో మధ్యాహ్నం 4.22 గంటలకు ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమాలు సాయంత్రం 6.21 వరకు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. అదే సమయంలో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రాంగణానికి చేరుకున్నారు.

### పార్టీని బలోపేతం చేయాలి

తొలుత రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన పలువురు క్రియాశీలక కార్యకర్తలు సభలో ప్రసంగించారు. రమేష్ అనే కార్యకర్త మాట్లాడుతూ పిల్లసేన, కోతి సేన అన్నవారికి లంకా దహనం ఎలా ఉంటుందో చూపించామన్నారు. విశాఖ తూర్పు నియోజకవర్గానికి చెందిన కార్యకర్త శ్రీకాంత్ మాట్లాడుతూ అసాధ్యాలను సుసాధ్యం చేయడం జనసైనికులకు మాత్రమే సొంతమన్నారు. భీమవరానికి చెందిన విజయలక్ష్మి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో జనసేనకు విజయం దక్కలేదని, అయితే 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో తమ ప్రాంతంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, జడ్పీటీసీ సభ్యులు గెలుపొందడం ద్వారా సాధారణ ఎన్నికల్లో పార్టీ ఘన విజయానికి బాటలు వేశామన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలోని ప్రతి గుడిసెపై జనసేన జెండా ఎగురుతుందని ఆ ప్రాంతానికి చెందిన శివ అన్నారు. శ్రీకాకుళానికి చెందిన విష్ణు ప్రియాంక మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ వలనే ఉద్దానం సమస్య ప్రపంచానికి తెలిసిందని, అక్కడ ఇంకా అనేక సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించేందుకు కృషిచేయాలని కోరారు. అనంతరం ఆమె పవన్‌కు వినతిపత్రం ఇచ్చారు.

### కర్ణాటక జెండా, కండువాతో పవన్..

పవన్ వేదికపైకి రాగానే అభిమానులు ఈలలు, చప్పట్లతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు అభివాదం చేశారు. ఈ క్రమంలోనే కర్ణాటక నుంచి వచ్చిన పలువురు కార్యకర్తలు పెద్దఎత్తున కేకలు వేస్తూ తమ రాష్ట్ర అధికారిక జెండాలను ప్రదర్శించారు. వారిని చూసిన పవన్ కల్యాణ్ కర్ణాటక జెండా, జనసేన జెండాతో కలిపి పట్టుకుని, మెడలో కర్ణాటక రాష్ట్ర జెండా రంగుతో కూడిన కండువాను వేసుకున్నారు. అనంతరం ఒడిశా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారితోనూ పవన్ ఫొటోలు దిగారు. పవన్ కల్యాణ్ ప్రసంగం అనంతరం మత్స్యకారులు చేప, వల, పడవ చిత్రాన్ని ఆయనకు బహూకరించారు. పవన్ కల్యాణ్ చిత్రాన్ని పచ్చబొట్టు వేయించుకున్న మత్స్యకార యువకుడితో పవన్ ఫొటో దిగారు. అనంతరం మృతిచెందిన కార్యకర్తల కుటుంబసభ్యులకు చెక్కులను అందించారు.

## భాగస్వామ్యం కల్పిస్తే.. నకిలీ అభ్యర్థులను గుర్తిస్తాం

» అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నకిలీ కుల ధ్రువీకరణలను గుర్తించేందుకు గిరిజన సంఘాలను భాగస్వాములను చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర చైర్మన్ యకశిరి వేంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోరాబు సత్యనారాయణ, దీనారి ప్రభాకర్ ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ ఫలితాలను ప్రకటించడం హర్షణీయమని, అయితే సర్టిఫికేషన్ వెరిఫికేషన్ సమయంలో జిల్లాలో ఎస్టీ నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలలో చేరే అవకాశం ఉందని, కాబట్టి గిరిజన ఉద్యోగ సంఘాల ప్రతినిధులను పరిగణనలోకి తీసుకుంటే, నకిలీ అభ్యర్థులను గుర్తించడానికి అవకాశం ఉంటుందని కోరారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన ప్రకారం నూటికి నూరు శాతం గిరిజన ఉద్యోగులతో షెడ్యూల్ ప్రాంతంలో నియామకాలు చేస్తామన్నారని, జీవో వచ్చే వరకూ షెడ్యూల్ ప్రాంతాల నియామకాలను నిలుపుదల చేయాలని కోరారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో స్పెషల్ డీఎస్సీ రిక్రూట్‌మెంట్ చేయాలని కోరారు.

## గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో ఉచిత శిక్షణ

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో రెండు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లీష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ సమీపంలో కెనరా బ్యాంకు ఎదురుగా శ్రీకృష్ణ ట్రావెల్స్ మేడపైన ఉన్న సంస్థ కార్యాలయంలో సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి అక్టోబరు 31 వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 10 గంటలు నుంచి 11.30 గంటల వరకు రోజూ తరగతులు ఉంటాయన్నారు. శిక్షణకు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆసక్తి కలిగిన గృహిణులు ఇనిస్టిట్యూట్‌కు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ : 80193 88999లో సంప్రదించాలని కోరారు.

## రుషికొండపై దుష్ప్రచారం

» మాజీ మంత్రి అమర్‌నాథ్ డిమాండ్

మద్దిలపాలెం, ఆగస్టు (ఆంధ్రజ్యోతి) : రుషికొండపై భవనాలు జగన్ ప్యాలెస్ అని దుష్ప్రచారం చేసినందుకు కూటమి పార్టీలు క్షమాపణలు చెప్పాలని వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు రుషికొండపై జగన్ ప్యాలెస్ నిర్మాణం చేస్తున్నారని ప్రచారం చేసి, ఇప్పుడు అవి ప్రభుత్వ భవనాలేనని సమర్థించుకుంటున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన రుషికొండ రిసార్ట్స్ కూటమి నేతలకు పొలిటికల్ టూరిజం డెస్టినేషన్‌గా మారాయన్నారు. ఏ పార్టీ నాయకులు వచ్చినా రుషికొండ సందర్శించి సెల్ఫీలు తీసుకోవడం, మళ్లీ వైసీపీపై బురదచల్లడం అలవాటుగా చేసుకున్నారని ఎద్దేవా చేశారు.

## సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 38, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 36, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 50, బంగాళదుంపలు 18, అరటికాయ (పె) 10, మునక్కాడలు (కిలో) 58, అల్లం (పాతది) 74, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 86, కీరదోస 30, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

**కోడిగుడ్లు (నెక్)** (వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 560 |
| విజయనగరం | 564 |
| శ్రీకాకుళం | 564 |

**చికెన్ ధరలు** బ్యాగ్

| | |
|---|---|
| రైతు ధర | 113 |
| లైవ్ ధర | 133 |
| విత్ స్కిన్ | 236 |
| స్కిన్‌లెస్ | 246 |

# క్రమశిక్షణ పెంపొందించే చదరంగం

» పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

» ఘనంగా అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ ప్రారంభం



చెస్ చాంపియన్‌షిప్ టోర్నీని ప్రారంభించిన పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు క్లబ్ వేదికగా ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఫిడే రేటింగ్ ర్యాపిడ్, బ్లిట్జ్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ టోర్నీ శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నీకి ముఖ్య అతిథిగా నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేయగా, ప్రత్యేక అతిథిగా బృహత్ నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గర్గ్ హాజరయ్యారు. పోలీసు కమిషనర్ బాగ్చి మాట్లాడుతూ చిన్నారులలో మేధస్సు, క్రమశిక్షణ పెంచే చెస్ క్రీడను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. చిన్నారుల నుంచి సీనియర్ల వరకు పోటీల్లో పాల్గొని ప్రతిభను ప్రదర్శించడం ఆనందదాయకమన్నారు. విశాఖ నుంచి అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనే క్రీడాకారులకు పాస్‌పోర్టు జారీలో తలెత్తే సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ సహకరిస్తుందని హామీ ఇచ్చారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గర్గ్ మాట్లాడుతూ దేశానికి ఖ్యాతి తెచ్చిన అనుభవ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. జీవీఎంసీ పాఠశాలల్లో చెస్ క్రీడకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన న్యాయవిశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఈ టోర్నీలో సుమారు 400 మంది పాల్గొనడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. వుమెన్ ఫిడే మాస్టర్, ఇంటర్నేషనల్ మాస్టర్ కొలగట్ల అలన మీనాక్షి, ఆర్వీ గ్రూప్ చైర్మన్ ఆర్.వెంకటేశ్వరరావు, వాల్తేరు క్లబ్ జి.శేషగిరిరావు, కార్యదర్శి సి.బాల సతీష్, ఆంధ్ర చెస్ సంఘం అధ్యక్షుడు ఎ.సురేష్, చైర్మన్ కె.వి.శర్మ తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు ఫలితాలు: తొలిరోజు ఆరు రౌండ్‌లు ముగిసే సరికి దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న డీఎస్ఎస్‌యూ.సాత్విక్, గొర్లి సైనా చెరో ఆరు పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలవగా, తలో 5.5 పాయింట్లతో ఎ.వి.ఎస్.విజయ్‌కుమార్, జి.రవికృష్ణ, మజ్జి రాంచరణ్ తేజ, గంపా ఆదిత్య వరుణ్, బి.రామన్ సిద్దార్థ రెండో స్థానంలో ఉన్నారు.

## తెలుగు సాహితీ చరిత్రలో ఆరుద్రది చెరగని ముద్ర

ఏయూ తెలుగు శాఖ విభాగాధిపతి జర్రా అప్పారావు



ఆరుద్రకు నివాళులు అర్పిస్తున్న ఆచార్య అప్పారావు, డీవీ సూర్యారావు, విద్యార్థులు

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహిత్య చరిత్రంలో ఆరుద్రది చెరగని ముద్ర అని ఏయూ తెలుగు శాఖ విభాగాధిపతి జర్రా అప్పారావు అన్నారు. ప్రముఖ రచయిత, పరిశోధకుడు, కవి ఆరుద్ర శతజయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏయూ తెలుగుశాఖలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆంధ్రా యూనివర్సిటీ, వేంకటేశ్వర యూనివర్సిటీ, తెలుగు విశ్వవిద్యాలయం ఆరుద్రకు కళాప్రపూర్ణ, డి.లిట్ పట్టా ఇచ్చి సత్కరించాయన్నారు. ఆరుద్ర రాసిన గ్రంథాలకు ఆంధ్రప్రదేశ్ అకాడమీ పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం వచ్చిందన్నారు.

తొలుత పలువురు ఆరుద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు ప్రాచార్యులు ఆచార్య ఎ.నరసింహారావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ దామెర వెంకటసూర్యారావు తదితరులు పాల్గొని మాట్లాడారు.

## ఎస్సీ కార్పొరేషన్ సిబ్బందితో చైర్మన్ సమీక్షా సమావేశం

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ ఎంవీపీ కాలనీలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సిబ్బందితో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యపద్మతో కలసి సమావేశంలో పలు అంశాలను చర్చించారు. షాపింగ్ కాంప్లెక్సులు, పౌల్ట్రీ కాంప్లెక్సులు, ఖాళీ స్థలాల అభివృద్ధి, ఏపీఎస్ ఆర్టీసీ హెవీ మోటార్ వాహనాల శిక్షణ, ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్కేఎఫ్‌డీసీ పథకాల అమలు, రికవరీ తదితర అంశాలపై చర్చించారు.

## చవితి పందిర్లలో అన్న సమారాధనలు



అన్నసమారాధనలో పాల్గొన్న వడ్డిస్తున్న ప్రతాప్‌రుద్ర

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా శనివారం వివిధ ప్రాంతాల్లో అన్నసమారాధన నిర్వహించారు. ఎంవీపీ కాలనీ సెక్టర్ 1, 3, ఆదర్శనగర్ ప్రాంతాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలకు ఎమ్మెల్యే వెలగపూడి తనయుడు, తెలుగుదేశం యువనాయకుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర హాజరై భోజనం వడ్డించారు. ఆయా పందిర్ల నుంచి గణేశ్ నిమజ్జనాన్ని ఆదివారం నిర్వహించనున్నారు.

## నేడు స్టీల్‌ప్లాంటు కార్మికుల మహా ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంటులో ఈవోఐలను నిరసిస్తూ ఆదివారం కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద మహా ధర్నా చేపట్టనున్నామని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు తెలిపారు. ఈవోఐల విషయంలో యాజమాన్యం వెనక్కితగ్గే వరకు పోరాటాలు చేస్తామని, వాటితో ప్లాంటు భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్నారు. యాజమాన్యంపై ఒత్తిడి పెంచేందుకు వీలుగా ఆదివారం ఉదయం 8 గంటలకు చేపట్టే మహా ధర్నాకు ఉక్కు ఉద్యోగులు, కార్మికులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

## మహిళా బిల్లు ఆమోదించాలి

» ఓబీసీ మహిళలకూ రిజర్వేషన్ కల్పించాలి

» రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకరరావు



కార్యక్రమంలో పాల్గొన్న శంకరరావు

సిరిపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : బీసీ మహిళలకు సబ్ కోటా ఇస్తూ మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణ చేసి మాత్రమే అమలు జరపాలని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, మహిళా విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఒక రోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జయశ్రీ మాట్లాడుతూ గత 30 ఏళ్లగా కేంద్రంలో పలు ప్రభుత్వాలు మారినా, చట్టసభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదింపబడలేదన్నారు. కేవలం మూలాయం, లాలు, శరద్‌యాదవ్‌లు మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు సబ్ కోటా తేల్చాలని పట్టుబట్టడం వలనే బిల్లును 30 ఏళ్లపాటు అటకెక్కించారన్నారు. ఎట్టకేలకు 33 శాతంతో మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆమోదించడం హర్షణీయమన్నారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ అనాదిగా ఓబీసీలు భారతీయ మనువాద సమాజంలో సామాజిక అణచివేతకు గురవుతున్నారన్నారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లతో కేంద్రం ఆమోదించిన మహిళా చట్టానికి , బీసీ మహిళకు సబ్ కోటానిస్తూ సవరణ చేసి మాత్రమే అమలు జరపాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాస్, ఉత్తరాంధ్ర కన్వీనర్ గొర్లె శ్రీనివాస్‌నాయుడు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పల్లా రమణ యాదవ్, నగర అధ్యక్షులు బోసు , బుద్దా చంద్రవాణి, పల్లా రమణ, పేడాడ సూర్యకుమారి, ప్రజా, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### జీవీఎంసీ రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

సిరిపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో ఎంతో బాధ్యతగా సుదీర్ఘకాలం ఉద్యోగ విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న ప్రతి ఒక్కరి శేష జీవితం ఆనందదాయకంగా ఉండాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి ఆకాంక్షించారు. శనివారం జీవీఎంసీ వివిధ హోదాలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న జీవీఎంసీ డీపీఓ ఎల్.సురేష్‌తో కలిసి సన్మానించారు.

## ప్రత్యేక అవసరాల విద్యార్థులకు అనువైన విద్యాబోధన అవసరం : ఏయూ వీసీ



స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన పుస్తకం ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ జీపీ రాజశేఖర్

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించి వారికి అనువైన బోధన, అభ్యసన విధానాలు అమలు చేయడం ఎంతో అవసరమని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ జీపీ రాజశేఖర్ అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో మూడు రోజుల పాటు జరిగిన ఎన్ఈపీ 2020 విత్ స్పెషల్ రిఫరెన్స్ టు స్పెషల్ ఎడ్యుకేషన్ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలానుగుణంగా విద్యా విధానం మార్పులకు లోనవుతుందని, నూతన బోధన విధానాలు సాంకేతికతలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. వీటిపై అవగాహన పెంచుకోవడం అందుకు అనుగుణంగా విద్యార్థులకు బోధన చేయడం ఎంతో అవసరమన్నారు. అదే సమయంలో ప్రత్యేక విద్యను బోధించేవారు నిరంతరం తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విద్యావిభాగాధిపతి టి.షారోన్‌రాజు, తదితరులు పాల్గొని మాట్లాడారు.


# ‘పెద్దలు మనకు మార్గదర్శకులు’



గ్రాండ్ పేరెంట్స్ డేలో పాల్గొన్న ఆచార్య జీఎస్ఎన్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆరిలోవ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రగతికి ఒక మార్గదర్శకం మన పెద్దలు అని సెంచూరియన్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. విశాఖ వ్యాలీ స్కూలులో శనివారం నిర్వహించిన గ్రాండ్ పేరెంట్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన వారసత్వ సంపద మన పెద్దలు అని, వారి నుంచి ప్రేమ, ఆప్యాయతానురాగాలు, మార్గదర్శనం అందించే గొప్ప చోదక శక్తులని పేర్కొన్నారు. కుటుంబ బాంధవ్యాలు, మానవ సంబంధాల గురించి చిన్నారులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరీ ప్రభాకర్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మన కుటుంబ వ్యవస్థ గురించి చిన్నారులకు తెలియజేసేందుకు ప్రతిఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు, కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అలరించిన నృత్య ప్రదర్శనలు




నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో సాంస్కృతిక కృతక్ విద్యాలయ ఏడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. పన్నెండు నృత్యాలకు 27 మంది నృత్య కళాకారిణులు అద్భుత అభినయంతో ప్రదర్శించిన కథక్ నృత్యాలు ఆకట్టుకున్నాయి. నయోషా, నిహీరా ఉత్తర, నిహీరాలు గణేష్ వందనంతో నృత్యాలు ప్రారంభించారు. శ్రీసంజన, సాయి సంజన ప్రదర్శించిన శివస్తుతి నృత్యాలకు ఆడిటోరియం కరతాళధ్వనులతో మారుమోగింది.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ గురుహరి రామ్మూర్తి మాట్లాడుతూ సమాజంలో చదువుతో పాటు కళలను కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. వాడ ప్రధాన కార్యదర్శి కన్నం వెంకటరమణారావు మాట్లాడుతూ నగరంలో గత ఏడు సంవత్సరాలుగా 700 మంది కథక్ నృత్యకళాకారుణలను తయారు చేయడంలో సాంస్కృతిక కృతక్ విద్యాలయ ప్రిన్సిపాల్ క్రితా కరుణి సేవలు అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో డాక్టర్ ఏఏఆర్ సత్యనారాయణ, విద్యాలయ ఫౌండర్ డైరెక్టర్ క్రితా కరుణి, నృత్య కళాకారిణులు పాల్గొన్నారు.

## హార్బర్ ఆధునికీకరణ వేగవంతం చేయాలి

» మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్



ఆధునికీకరణ పనుల గురించి తెలుసుకుంటున్న మత్స్య శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, పాల్గొన్న అధికారులు



ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులతో మాట్లాడుతున్న కమిషనర్ ఆర్ఎస్ నాయక్

బీచ్ రోడ్డు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఫిషింగ్ హార్బర్‌లో ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలని మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్ ఆదేశించారు.. శనివారం ఆయన ఫిషింగ్ హార్బర్‌లో జరుగుతున్నఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాఖ పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో రూ.178 కోట్లతో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. కొత్తగా నిర్మిస్తున్న ఫిషింగ్ జెట్టీలు, వేలం కేంద్రాలు, ఈటీపీ, పార్కింగ్ బిల్డింగ్, నెట్ మెండింగ్ హాల్స్ స్టోరేజీ నిర్మాణాలను పరిశీలించారు. అదేవిధంగా సీఎంఎఫ్ఆర్ఐలో గల సీకేజ్, సీవీడ్ రాఫ్టులు పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు, శాస్త్రవేత్త డీపీఎం కృష్ణ, రితీష్, ఎఫ్‌డీవోలు ఆశాజ్యోతి, మురళి, పోర్టు ఇంజనీరింగ్ శాఖ అధికారులు, బోట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం.లక్ష్మణరావు, సీహెచ్ వీర్రాజు, పీసీ అప్పారావు, బి.కొండలరావు, ఎం.ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

## యూత్‌ఫెస్ట్‌లో కృష్ణా కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బి.సుజాత

మద్దిలపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి యూత్ ఫెస్ట్-25లో డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా బహుమతులు గెలుచుకున్న విద్యార్థులకు ప్రిన్సిపాల్ బి.సుజాత అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన యూత్ ఫెస్ట్‌లో ఎయిడ్స్‌పై నిర్వహించిన క్విజ్ పోటీల్లో తమ కళాశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థులు బహుమతులు పొందారన్నారు. పోటీ అంశాల్లో అవగాహన పెంచుకొని ఉత్తమ విద్యార్థులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.సన్యాసిరావు, ఆర్పీ నాయుడు, వేదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు.



**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయంలో శనివారం విఘ్నగణపతిగా అలంకరణ -ఆంధ్రజ్యోతి, సీతంపేట



ఆంధ్రజ్యోతి కార్యాలయం సమీపంలోని ఆలయంలో నవనీత గణపతిగా అలంకరణ -ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

## రైతుబజార్‌లో అన్నదానం



సీతమ్మధారలో వడ్డిస్తున్న రైతులు, సిబ్బంది

సీతమ్మధార, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార రైతుబజార్‌లో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రైతు బజార్ల నుంచి రైతులు, ఎస్టేట్ అధికారులు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మార్కెట్ అధికారులు, ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి, నారాయణ, షర్మిల, సతీష్ పాల్గొన్నారు.

## ఐటీబీపీ హెడ్ క్వార్టర్స్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య



నరేంద్రనాథ్ (ఫైల్)

ఆనందపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం మండలం పందలపాక సమీపంలోని 56వ ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) బెటాలియన్ హెడ్ క్వార్టర్స్‌లో ఒక కానిస్టేబుల్ (జీడీ) శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్టు సీఐ చింతా వాసునాయుడు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా డోన్ మండలం ఆర్ఎస్ రంగాపురం ప్రాంతానికి చెందిన జగదల నరేంద్రనాథ్ (32) ఐటీబీపీలో కానిస్టేబుల్‌గా (జీడీ)గా పనిచేస్తున్నాడు. 2014లో పోలీస్ శాఖలో చేరిన నరేంద్రనాథ్ గత 15 నెలలుగా 56వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అయితే శుక్రవారం గార్డు విధులు నిర్వర్తిస్తూ రాత్రి ఏడు గంటల ప్రాంతంలో బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌లోని మామిడి చెట్టుకు నైలాన్ వైర్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు బెటాలియన్ ఇన్‌చార్జి సూరజ్ ప్రకాష్‌జోషి ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి సీఐ చింతా వాసునాయుడు, ఎస్ఐ సంతోష్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. నరేంద్రనాథ్ కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతున్నాడని, గతంలో ఢిల్లీలో చికిత్స తీసుకున్నాడని తెలిసింది. నెల రోజుల కిందట ఒకసారి ఆత్మహత్యకు యత్నించినట్టు సమాచారం.

## గిడుగుకు ఘననివాళి

సీతంపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గ్రాంధిక భాషలో ఉన్న తెలుగును జనులందరి వాడుక భాషలోకి తేవడానికి గిడుగు వెంకట రామమూర్తి చేసిన కృషి అనిర్వచనీయమని, ప్రతి పనిని ఆయన ఇష్టంతో చేసేవారని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల సెక్రటరీ డాక్టర్ జి.మధుకుమార్ అన్నారు. బుల్లయ్య కళాశాలలో తెలుగు భాషాదినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి అధ్యాపకులు నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎస్‌కే చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, గౌసీ బాబు, శ్రీనివాసరెడ్డి, రమణమూర్తి, జూనియర్, ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సోమేశ్వరరెడ్డి, దీపక్ చౌదరి, తెలుగు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కబ్జాదారులకు చెక్

... 5వ పేజీ తరువాయి

అధికారులకు ఫిర్యాదులు అందాయి. అలాగే గెడ్డ వాగు కబ్జా చేయడంతో వర్షాకాలంలో నీరు గ్రామంపైకి వస్తోందని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో తనకున్న పలుకుబడి ఉపయోగించుకుని ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేయించిన ప్రజా ప్రతినిధిపై ప్రస్తుత రెవెన్యూ అధికారులు విచారణకు నిర్ణయించారు. త్వరలో మరికొన్ని ఆక్రమణలను గుర్తించి స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు.

# ఇళ్ల వద్ద స్మార్ట్ కార్డుల పంపిణీ...తూచ్!



బర్మాక్యాంప్ 527 డిపో వద్ద కొత్త రేషన్ కార్డుల కోసం క్యూ కట్టిన కార్డుదారులు

మురళీనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జారీ చేసిన కొత్త స్మార్ట్ కార్డుల కోసం రేషన్‌కార్డుదారులు హైరానా పడుతున్నారు. మొదట ఈ నెల 24న ఏఎస్‌ఓ కార్యాలయం నుంచి అన్ని రేషన్ డిపోలకు చేరిన కార్డులను రెండు రోజుల తర్వాత సచివాలయాలకు పంపారు. అక్కడితో డీలర్లు తమది కాదన్నట్లు మిన్నకుండిపోయారు. సచివాలయాల వద్ద ఈ నెల 27న నాయకులు లాంఛనంగా కొద్దిమందికి పంపిణీ చేశారు. తర్వాత ఇంటింటికీ సచివాలయ సిబ్బంది వెళ్లి కార్డులు అందిస్తారని ప్రకటించారు. 28, 29 తేదీల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలోని కొన్ని సచివాలయాల్లో మాత్రమే వీటిని అందించారు. మిగిలిన సచివాలయ సిబ్బంది జాబితా తమ వద్ద ఉండదని, కార్డులు రేషన్ డిపోల్లోనే తీసుకోవాలని సూచించడంతో స్మార్ట్ కార్డుల కోసం సచివాలయాలు, రేషన్ డిపోలకు తిరుగుతున్నారు. శనివారం సచివాలయ కార్యదర్శులు డీలర్ల చేతికే కార్డులిచ్చారు. ఇళ్ల వద్దకే వచ్చి ఇస్తారన్న మాటలు గాల్లో కలిసిపోయాయి. ఎండా వానల్లో డిపోల వద్దే క్యూలైన్లు కట్టి వృద్ధులు సైతం తీసుకోవాల్సి వచ్చింది. బర్మాక్యాంప్ 527వ రేషన్ డిపో వద్ద కార్డుల కోసం రోజంతా నానా ప్రయాస పడి తీసుకెళ్లారు. వారు చెప్పిన చోట, చెప్పిన సమయానికి వస్తేనే కార్డు అందుతుంది. లేదంటే మరో రోజు రండి.. అనే సమాధానమే! మరోపక్క మర్రిపాలెం ప్రాంతంలో 299వ సచివాలయంలో మాకు సచివాలయంలోనే అందించాలని సూచించారని అందరు కార్యదర్శులు అక్కడికే జనాన్ని పిలిపించి కార్డులు అందించారు. సచివాలయానికి చేరిన కార్డుదారులతో 299వ వార్డు సచివాలయం రోజంతా కిక్కిరిసింది. ఒక్కో చోట ఒక్కో విధంగా పంపిణీ జరుగుతుండటంతో వినియోగదారులు తికమకపడుతున్నారు. డిపో డీలర్లను వాకబు చేయగా, తమ వద్ద కార్డులు ఉండవన్న సమాధానం వినవస్తోంది. సచివాలయాలకు వెళ్తే కార్డులు డిపోలకు వస్తాయని, ఇంటింటికీ వచ్చి ఇస్తారని చెబుతుండటంతో వారం రోజులైనా, ఇప్పటికీ కార్డుల పంపిణీ 20 శాతం కూడా పూర్తి కాలేదు. పైగా ఆగస్టు 31, సెప్టెంబరు 1, 2 తేదీల్లో పెన్షన్ పంపిణీ బాధ్యతలు ఉంటాయని, కార్డులు ఇవ్వలేమని సచివాలయ కార్యదర్శులు సెలవిస్తున్నారు. తామంతా కొత్తగా బదిలీపై గత నెలలోనే వచ్చినందున, సచివాలయ పరిధి నివాసాలపైనా, మ్యాపింగ్, క్లస్టర్ వివరాలు అయోమయంగా ఉన్నాయని కార్యదర్శులు పేర్కొంటున్నారు. ఈ తతంగం ఇలా సాగుతున్నా, సివిల్ సప్లయిస్ అధికారులు, రెవెన్యూ చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు. స్పష్టమైన మార్గదర్శకాలు లేవు. కొన్ని చోట్ల కార్డులను అందిస్తున్న రేషన్ డీలర్లు స్మార్ట్ కార్డుల జారీకి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.

### ఎక్కడికి వెళ్లాలో..ఎవరిస్తారో తెలియడం లేదు!

నా కార్డు మ్యాపింగ్ వివరాలు తెలుసుకోవడానికి నాలుగు రోజులుగా తిరుగుతున్నాను. సచివాలయానికి వెళ్తే అక్కడ కార్డులు లేవన్నారు. మీది 100వ నంబరు డిపో. అక్కడికే వెళ్లి అడగండి అని 282వ సచివాలయంలో సిబ్బంది చెప్పారు. డీలరు చిరునామా తెలీదు. మొత్తానికి ఆ డీలరు ఫోన్ నంబరు తెలుసుకుని వాకబు చేస్తే ఆయన పెందుర్తి ఎన్టీఆర్ జంక్షన్ దగ్గరకు వచ్చి ఫోన్ చేయాలని సూచించారు. అక్కడికి వెళ్లినా కార్డు ఉంటుందో లేదో... తెలీదు. ఎక్కడా సచివాలయాల్లో కార్డుదారుల వివరాలు తెలియజేసేలా జాబితాలు ప్రదర్శించడం లేదు. బోర్డుల్లో ఎలాంటి వివరాలు పెట్టడం లేదు. ఎటు పోవాలో తెలీక కార్డుదారులు గందరగోళంలో ఉన్నారు. మాది బర్మాక్యాంప్‌లో ఇల్లు.. కార్డు పెందుర్తి 100వ నంబరు డిపోలో ఉంది

- బంకపల్లి శివప్రసాద్, బర్మాక్యాంప్

## ఉత్సాహంగా బీచ్ కబడ్డీ టోర్నీ



విజేత ట్రోఫీ అందుకుంటున్న చంద్రంపాలెం బాలుర జట్టు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రో కబడ్డీ లీగ్‌లో ఆడుతున్న బెంగాల్ వారియర్స్ శనివారం ఆర్.కె. బీచ్ వద్ద స్కూల్ విద్యార్థులకు బీచ్ కబడ్డీ పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో మధురవాడ చంద్రంపాలెం జెడ్పీ స్కూల్, గోపాలపట్నం ఎస్‌వీఎల్ఎన్ జెడ్పీ స్కూల్ నుంచి బాలురు, బాలికల జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఈ టోర్నీలో బాలురు, బాలికల విభాగాల్లో చంద్రంపాలెం జెడ్పీ స్కూల్ విన్నర్ ట్రోఫీలు కైవసం చేసుకోగా, గోపాలపట్నం జెడ్పీ స్కూల్ బాలురు, బాలికల జట్లు రన్నరప్‌గా నిలిచాయి. ముగింపు కార్యక్రమంలో కాప్రి స్పోర్ట్సు డైరెక్టర్, బెంగాల్ వారియర్స్ కెప్టెన్ దేవంక్ దలాల్, చీఫ్ కోచ్ నవీన్‌కుమార్ ముఖ్య అతిథులుగా విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. విజేతగా నిలిచిన చంద్రంపాలెం జట్టు ఆటగాళ్లకు బెంగాల్ వారియర్స్ తలపడే మ్యాచ్‌ను వీక్షించేందుకు ఉచితంగా టికెట్లను అందజేసింది. అలాగే కబడ్డీ క్రీడలో రాణించే మెలకువలను చిన్నారులకు వివరించారు. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేసి ఉన్నత క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బెంగాల్ వారియర్స్ ఆటగాళ్లు జాంగ్ కున్ లీ, విశ్వాస్ పాల్గొన్నారు.



బాలికల విభాగంలో విజేతగా చంద్రంపాలెం క్రీడాకారిణులు

## జిల్లా కోర్టులో న్యాయవిజ్ఞాన సదస్సు



ప్రసంగిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు

డాబాగార్డెన్స్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలు, తెగల వారికి చట్టపరమైన హక్కులు, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం (1989)లోని నిబంధనలు, అత్యాచారాల రకాలు, నేరస్తులకు విధించే శిక్షలు, బాధితులకు అందే న్యాయ సహాయం గురించి వివరించారు. బాలికల విద్యకు ప్రాధాన్యత, విద్య ద్వారా స్వయం సమృద్ధి అంశాలపై మాట్లాడారు. ఈ సదస్సులో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు కె.రామారావు, డీడబ్ల్యూసీడబ్ల్యూ అండ్ ఈఓ కేవీ రామలక్ష్మి, బి.సురేష్‌కుమార్, ఆర్.రమేష్, బి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులు



శిక్షణ కార్యక్రమంలో సూచనలు చేస్తున్న ప్రధానోపాధ్యాయిని రాజ్యలక్ష్మి

కంచరపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులని, నిత్యం నేర్చుకుంటూ పాఠ్యాంశాలు బోధిస్తుంటారని జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ఆర్పీపేట క్లస్టర్ ఉపాధ్యాయులకు ఆగస్టు నెలకు సంబంధించిన ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తేజకరమైన బోధన అందించాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించి చిన్నారులు పాఠశాలలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాలని కోరారు. అనంతరం పాఠశాలల వారీగా సి, డి.. గ్రేడుల పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి అభ్యసన సామర్థ్యాలు పెంచాలన్నారు. అనంతరం ఒకటి, రెండు తరగతులు,మూడు నుంచి ఐదు తరగతులకు వేర్వేరుగా శిక్షణ ఇచ్చారు. సబ్జెక్టు ఉపాధ్యాయులకు నిపుణుల ద్వారా ఆన్‌లైన్ శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ పరిధిలోని 8 పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం



విజయనగరం యార్డులో సూచనలిస్తున్న రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శనివారం విజయనగరం స్టేషన్ యార్డులో తనిఖీలు చేపట్టారు. ట్రాక్ నిర్వహణ, సిగ్నలింగ్ విధానంలో చేపడుతున్న భద్రత చర్యలను పరిశీలించారు. అనంతర స్టేషన్‌లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో పలు అంశాలపై సమీక్షించారు. భద్రతకు ప్రాధాన్యమివ్వాలని, ప్రయాణికులకు మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ వద్దని సూచించారు. సాంకేతికతపై అవగాహన పొంది ముందుకు సాగాలన్నారు. భద్రత పెంపునకు ఆధునికీకరణ పద్ధతులు పాటించాలని సూపర్‌వైజర్లకు సూచించారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్వయం నిర్ణయాత్మక శక్తితోనే మహిళా సాధికారత

» సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకల్లో డాక్టర్ సరిత సూచన



స్వాగత వేడుకలు ప్రారంభిస్తున్న అతిథులు

జ్ఞానాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో స్వయం నిర్ణయాత్మక శక్తి పెరిగినప్పుడే సాధికారిత పొందినట్లని గీతం యూనివర్సిటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ డా.పి.సరిత పేర్కొన్నారు. స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం 68వ స్టూడెంట్ కౌన్సిల్ ఫ్రెషర్స్ డే (స్వాగత) వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె విద్యార్థినులకు భవిష్యత్తు, సవాళ్లు, ఉద్యోగ అవకాశాలపై దిశానిర్దేశం చేశారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన డా.సరిత వేడుకలను ప్రారంభించారు. నూతన విద్యార్థులను స్వాగతిస్తూ ఏటా వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ తెలిపారు. అనంతరం విద్యార్థినులు శాస్త్రీయ, పాశ్చాత్య, జానపద నృత్యాలు చేశారు. పాటలు, మూకాభినయంతో ఆహూతులను అలరించారు. మిస్ ఫ్రెషర్ విభాగంలో డిగ్రీలో అమృతా ఖ్యాతి, ప్రగ్య రాణి, ఇంటర్మీడియట్‌లో జమీల ఖతూన్, అనుష్క విజేతలుగా నిలిచారు. వీరిని ప్రిన్సిపాల్ కిరీటాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సలహాదారులు డాక్టర్ సుజాత, సోనీ, డాక్టర్ మానవి, ప్రమీల, సిస్టర్ దిపాలి, ప్రత్యూష, డాక్టర్ కోటేశ్వర్, డాక్టర్ ప్రవీణ్, ఊర్మిళ, డా.పీకే జయలక్ష్మి పాల్గొన్నారు.





వేడుకల్లో ఉత్సాహంగా స్టెప్పులేస్తున్న విద్యార్థినులు

## షెల్టర్ హోమ్‌లో ఆధార్ నమోదు కేంద్రం



ఆధార్ నమోదును పరిశీలిస్తున్న సీపీ బాగ్చి

అక్కయ్యపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనర్ (సీపీ) తలపెట్టిన 'మిషన్ తమసోమ జ్యోతిర్గమయ' కార్యక్రమంలో భాగంగా ఏయూటీడీ జీవీఎంసీ షెల్టర్ హోంలలో వసతి కల్పించిన 210 మంది నిరాశ్రయులలో 128 మంది యాచకులు, మానసిక రోగులకు ఆధార్ నమోదు చేయడానికి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతిగృహంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలిముద్రల ఆధారంగా ఎవరికైనా ఆధార్ ఉంటే అందులో ఉన్న చిరునామా తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించడానికి, మిగిలిన వారికి ఆధార్ కార్డులు ఇప్పించి పింఛన్లు మంజూరు వంటి ప్రభుత్వ పథకాలు పొందేలా పునరావాసం కల్పించే ఉద్దేశంతో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెపారు. ఈ కార్యక్రమంలో ఆధార్ సెంటర్ మేనేజర్ బాల సుబ్రహ్మణ్యన్, ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, కంట్రోల్ రూం సీఐలు హస్సేన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా జాతీయ క్రీడా దినోత్సవం



సీనియర్ ఫుట్‌బాలర్లను సత్కరించిన టీసీఎఫ్ఏ ప్రతినిధులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని వాల్తేరు రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. టీసీఎఫ్ఏ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొని ముందుగా హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోర్టు అథారిటీ రిటైర్డ్, జాతీయ ఫుట్‌బాల్ మాజీ క్రీడాకారుడు శేషుమోహన్, రైల్వేస్ ఫుట్‌బాలర్ శాస్త్రి, రిటైర్డ్ రైల్వేస్ సన్యాసిరావు, శంకరరావులను టీసీఎఫ్ఏ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాల్తేరు రైల్వే ఫుట్‌బాల్ కోచ్ కన్నబాబు, మాజీ కోచ్ కె.తిరుమలరావు, పోర్టు ఫుట్‌బాలర్లు పి.అప్పారావు, తిరుమల రావు, ఎస్.కె.ఖరీం, హెడ్ కానిస్టేబుల్ రవి, మసీనా, సైదిల్‌బాబు, గంగ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌జీజీఓస్ కాలనీ ఉన్నత పాఠశాలలో..

అక్కయ్యపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని శనివారం ఎన్జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి, వ్యాయామ ఉపాధ్యాయురాలు యు.ఎన్. రత్నంల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 26వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్ హాజరై నెల రోజుల క్రితం నుంచి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రోటరీ క్లబ్ సురభి అధ్యక్షురాలు టి.సత్యశ్రీ లక్ష్మీ దేవి, సెక్రటరీ ఎం.ఎస్.ఎ. శ్రీహర్ష, డి. అరుణ సందీప్ ు పాల్గొన్నారు.

## డిసెంబరు 14న నేవీ మారథాన్

... 5వ పేజీ తరువాయి

21.097 కి.మీ (హాఫ్ మారథాన్), 10 కి.మీ. పరుగు, 5 కి.మీ. ఫన్ రన్ ఉంటాయన్నారు. వీటికి ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి వరకూ రేస్ మార్గాలు కూడా నిర్దేశించామన్నారు. దీనికి ముందు ప్రతి నెల రెండో ఆదివారం ఆర్‌కే బీచ్ రోడ్డులో ప్రోమో రన్నింగ్, కండిషనింగ్, స్ట్రెంగ్త్ ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, వైజాగ్ నేవీ మారథాన్ ఇది క్రీడా కార్యక్రమమే కాకుండా నగర ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు ఉపయోగపడే వేడుక అని పేర్కొన్నారు.

## పారదర్శకంగా బార్‌ల కేటాయింపు ప్రక్రియ

... 5వ పేజీ తరువాయి

సమక్షంలో లాటరీ తీసి బార్లను కేటాయించారు. జిల్లాలో 131 బార్‌లకు (రిజర్వ్ 10+ఓపెన్ 121) 263 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించి గీత కులాలకు పది, జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 57 బార్‌లను కేటాయిస్తూ నూతన బార్ పాలసీ నిబంధనల ప్రకారం లాటరీ ప్రక్రియను నిర్వహించారు. ఈ ప్రక్రియలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు. దరఖాస్తులు రాక మిగిలిపోయిన బార్ విషయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలియజేశారు.

## అంతా ఒకే మాటపై ఉండాలి

... 5వ పేజీ తరువాయి

వినియోగంలోకి తీసుకువస్తామని ప్రకటించారు. అనంతరం బే వ్యూ హోటల్‌లో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ఆగిందని, అయినప్పటికీ కొంతమంది కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, దానిని తిప్పికొట్టాలని నాయకులకు పిలుపునిచ్చారు. కూటమిలో విభేదాలు వద్దని, అది పార్టీతో పాటు రాష్ట్రానికి తద్వారా ప్రజలకు కూడా నష్టమని స్పష్టంచేశారు. ఇంకో పదిహేనేళ్లు కూటమితో కలిసి ప్రయాణం చేయాల్సి ఉందని స్పష్టంచేశారు. ఈ సమావేశాల నిర్వహణకు 12 కమిటీలను వేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, డీసీసీబీ అధ్యక్షుడు కోన తాతారావు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

## జేఎన్ఎన్‌యూఆర్ఎం బస్సులకు తాత్కాలిక బ్రేక్

... 5వ పేజీ తరువాయి

బస్సులు హైవే రన్నింగ్‌కు బాగుంటాయని అప్పటి అధికారులు స్టీల్‌సిటీ డిపోనకు కేటాయించారు. ఇందులో 16 బస్సులను విజయనగరం, రెండు బస్సులు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్ రూట్లలో నడుపుతున్నారు.

### నిపుణుల పరిశీలన

నగరంలో శుక్రవారం ఒక బస్సు దగ్ధమైన నేపథ్యంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం బస్సుల సాంకేతికతను మెకానికల్ ఇంజనీర్ల బృందం శనివారం పరిశీలించింది. విజయవాడ నుంచి వచ్చిన ఆర్టీసీ సీనియర్ మెకానికల్ ఇంజనీర్లు శర్మ, మాధవ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (మెకానికల్) బ్రహ్మానందరెడ్డిలు శాంతిపురం జంక్షన్‌లో శుక్రవారం దగ్ధమైన బస్సును, స్టీల్‌సిటీ డిపోలో నిలిపి ఉంచిన బస్సులను క్షుణ్ణంగా పరిశీలించారు. వీరికి విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పద్మావతి, మెకానికల్ ఫోర్‌మన్, ఇద్దరు అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్లు బస్సుల పనితీరును వివరించారు.

## స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు ముఖ్యమంత్రి కృషి

... 5వ పేజీ తరువాయి

తీసుకుంటున్నారన్నారు. దీనిని కొంతమంది ప్రైవేటీకరణగా చిత్రీకరిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. గతంలో కొంతమంది కాంట్రాక్టర్‌లు, అధికారులు, కార్మిక నాయకులు కుమ్మక్కై లేని రెండు వేల మంది కాంట్రాక్టు కార్మికుల పేర్లను చూపించి జీతాలు దోచుకున్నారన్నారు. బయోమెట్రిక్ విధానం ప్రవేశపెట్టిన తరువాత అవకతవకలు బయపడ్డాయన్నారు. వెంటనే తప్పుడు పేర్లను తొలగించడం జరిగిందన్నారు.

స్టీల్‌ప్లాంటు నిర్వాసితులకు అన్యాయం జరగదని, అందరికీ ఉపాధి కల్పించడానికి కృషి చేస్తున్నామని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల పోస్టుల్లో యాభై శాతం నిర్వాసితులకు కేటాయించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్లాంటులో ఈ నిబంధనను తప్పనిసరిగా పాటించాలన్నారు. నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మిగిలిన నిర్వాసితులకు కూడా ఉపాధి కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు. నిర్వాసిత కార్మికులు, సీనియర్ కాంట్రాక్టు కార్మికులను కాంట్రాక్టర్లు కొనసాగించాలన్నారు. నిర్వాసితులకు అన్యాయం జరగదని, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

# సేనలో నూతనోత్సాహం

... 5వ పేజీ తరువాయి

లక్ష్యాలను నిర్దేశించడంతో పాటు వారిని నాయకులుగా తీర్చిదిద్దేందుకు తన వద్దనున్న ప్రణాళిక లను సుదీర్ఘంగా వివరించారు. వైసీపీ హయాంలో సాగించిన పోరాటాన్ని మననం చేసుకుంటూనే భవిష్యత్తులో పార్టీని ఎలా ముందుకు తీసుకువెళ్లాలనుకుంటున్నదీ వివరించారు. ఇందుకోసం కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలని, వారిని నాయకులుగా తీర్చిదిద్దే బాధ్యతను తాను తీసుకుంటానని, అందుకు పదేళ్ల సమయం పడుతుందని పవన్ స్పష్టం చేశారు. అధినేత ప్రసంగానికి జనసైనికులు, వీర మహిళలు ఆద్యంతం ఈలలు, చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ తరహా సభను కార్యకర్తలతో నిర్వహించడం, అది విజయవంతం కావడంతో పార్టీ నాయకులు, శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

### సభను ప్రారంభించిన వీర మహిళ

సాధారణంగా సభలను పార్టీ ముఖ్య నేతలు ప్రారంభిస్తారు. దానికి భిన్నంగా 'సేనతో సేనాని' సభను వీరమహిళ గోవిందమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నోవాటెల్ హోటల్‌లో పవన్‌ను దిగ్బంధించిన సమయంలో ఆమె మూడేళ్ల చంటి బిడ్డతో జనసేన జెండా పట్టుకుని రాత్రంతా దీక్ష చేసింది. సభా ప్రాంగణంలో మధ్యాహ్నం 4.22 గంటలకు ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమాలు సాయంత్రం 6.21 వరకు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. అదే సమయంలో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రాంగణానికి చేరుకున్నారు.

### పార్టీని బలోపేతం చేయాలి

తొలుత రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన పలువురు క్రియాశీలక కార్యకర్తలు సభలో ప్రసంగించారు. రమేష్ అనే కార్యకర్త మాట్లాడుతూ పిల్లసేన, కోతి సేన అన్నవారికి లంకా దహనం ఎలా ఉంటుందో చూపించామన్నారు. విశాఖ తూర్పు నియోజకవర్గానికి చెందిన కార్యకర్త శ్రీకాంత్ మాట్లాడుతూ అసాధ్యాలను సుసాధ్యం చేయడం జనసైనికులకు మాత్రమే సొంతమన్నారు. భీమవరానికి చెందిన విజయలక్ష్మి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో జనసేనకు విజయం దక్కలేదని, అయితే 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో తమ ప్రాంతంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, జడ్పీటీసీ సభ్యులు గెలుపొందడం ద్వారా సాధారణ ఎన్నికల్లో పార్టీ ఘన విజయానికి బాటలు వేశామన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలోని ప్రతి గుడిసెపై జనసేన జెండా ఎగురుతుందని ఆ ప్రాంతానికి చెందిన శివ అన్నారు. శ్రీకాకుళానికి చెందిన విష్ణు ప్రియాంక మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ వలనే ఉద్దానం సమస్య ప్రపంచానికి తెలిసిందని, అక్కడ ఇంకా అనేక సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించేందుకు కృషిచేయాలని కోరారు. అనంతరం ఆమె పవన్‌కు వినతిపత్రం ఇచ్చారు.

### కర్ణాటక జెండా, కండువాతో పవన్..

పవన్ వేదికపైకి రాగానే అభిమానులు ఈలలు, చప్పట్లతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు అభివాదం చేశారు. ఈ క్రమంలోనే కర్ణాటక నుంచి వచ్చిన పలువురు కార్యకర్తలు పెద్దఎత్తున కేకలు వేస్తూ తమ రాష్ట్ర అధికారిక జెండాలను ప్రదర్శించారు. వారిని చూసిన పవన్ కల్యాణ్ కర్ణాటక జెండా, జనసేన జెండాతో కలిపి పట్టుకుని, మెడలో కర్ణాటక రాష్ట్ర జెండా రంగుతో కూడిన కండువాను వేసుకున్నారు. అనంతరం ఒడిశా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారితోనూ పవన్ ఫొటోలు దిగారు. పవన్ కల్యాణ్ ప్రసంగం అనంతరం మత్స్యకారులు చేప, వల, పడవ చిత్రాన్ని ఆయనకు బహూకరించారు. పవన్ కల్యాణ్ చిత్రాన్ని పచ్చబొట్టు వేయించుకున్న మత్సకార యువకుడితో పవన్ ఫొటో దిగారు. అనంతరం మృతిచెందిన కార్యకర్తల కుటుంబసభ్యులకు చెక్కులను అందించారు.

# వుడా కాలనీలో సమస్యల తిష్ఠ

- కనీస సౌకర్యాలు లేక స్థానికుల అవస్థలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


వుడా కాలనీ వ్యూ



కాలనీ ప్రారంభించినప్పటి శిలాఫలకం


పూర్తిగా నాశనమైన కాలనీ ప్రధాన రహదారి

పెందుర్తి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 97వ వార్డు వుడాకాలనీ ఏర్పడి రెండు దశాబ్దాల అవుతున్నా నేటికీ సమస్యలతోనే సావాసం చేస్తున్నారు. కార్పొరేషన్‌కు అన్ని పన్నులు చెల్లిస్తున్నా మౌలిక వసతులు కల్పనలో మాత్రం శూన్యం. కాలనీలోని సమస్యలు అధికారులకు ఎన్నిసార్లు ఏకరువు పెట్టినా స్పందన ఉండడం లేదు. 2005లో చినముషిడివాడ వుడా లేఅవుల్ వేసి హెచ్ఐజీ, ఎంఐజీ, ఎల్ఐజీ 500 ఇళ్ల నిర్మించి అప్పటి రాష్ట్ర గవర్నర్ సుశీల్‌కుమార్ షిండే కాలనీని ప్రారంభించారు. ఇప్పుడు కాలనీకి అనుసంధానంగా వీరానగర్, అయ్యప్పనగర్, గాంధీనగర్, రైల్ విహార్ కాలనీలు విస్తరించడంతో సుమారు మూడు వేల మంది నివసిస్తున్నారు. ఇంతమంది నివసిస్తున్న కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీకి చేరుకునే రోడ్డు కూడా అస్తవ్యస్తంగా మారింది. సీసీ రోడ్ల మీద రాళ్లు తేలి ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### వుడా కల్యాణ మండపానికి దారేది?

చినముషిడివాడ వుడా కాలనీ వీఎంఆర్డీఏ నిధులు రూ.1.5 కోట్లతో నిర్మించిన కల్యాణ మండపానికి సరైన రీతిన రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షానికి రోడ్డు మొత్తం బురదమయంగా మారుతోంది. కాలనీలో ఏర్పాటు చేసిన మ్యాన్‌హోళ్ల ప్రమాదకంగా మారాయి. వర్షం వస్తే రోడ్డు మొత్తం బురదమయంగా మారుతోంది. అలాగే కాలనీలో పరిశుభ్రత లోపించడంతో దోమలు పెరిగి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. వీధుల్లో కుక్కల బెడద కూడా పెరిగిపోయింది. వీధి దీపాలు సక్రమంగా పనిచేయడం లేదు. ఇక రవాణ సంగతి చూస్తే సిటీ బస్ ఒక ట్రిప్ మాత్రమే వేస్తుండడంతో ప్రజలు ప్రయాణాలకు ఇబ్బందులు పడుతున్నారు.

### 60 అడుగులు రోడ్డు విస్తరణ మాటేంటి..?

చినముషిడివాడ నుంచి వుడా కాలనీకి వెళ్లాలంటే సుమారు ఒకటిన్నర కిలోమీటర దూరం ఉంటుంది. ఈ క్రమంలో వీఎంఆర్‌డీఏ ప్లాన్ ప్రకారం ఈ రోడ్డును 60 అడుగుల రహదారిగా విస్తరించాలి. కానీ ఇరవై ఏళ్లగా రహదారి విస్తరణ జరగలేదు.

### కనీస సదుపాయాలు లేవు



జీవీఎంసీకి అన్ని పన్నులు చెల్లిస్తున్నా మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. కాలనీలో మూడువేల మంది నివసిస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని జోనల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోతోంది. రోడ్డు, డ్రైనేజీ, సమస్యలతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. అడుగుకో గుంత అన్నట్టు కాలనీలో రోడ్ల పరిస్థితి ఉంది.

అన్నెపు చక్రధరరావు (వుడాకాలనీ)

## నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

అగనంపూడి,ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పినమడక రామాలయం వద్ద భువనేశ్వరి కంటి ఆస్పత్రి సహకారంతో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గ్రామస్థులు అధిక సంఖ్యలో కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## గం గణపతియే నమః



కూర్మన్నపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు తిరుమల నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శనివారం సామూహిక కుంకుమ పూజలు, సుందరాకాండ పారాయణం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొండా జగన్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు. అలాగే జీవీఎంసీ 88వ వార్డు ఎస్టీబీఎల్‌లో ఎల్ఎస్ గార్డెన్స్‌లో వినాయకుని మండపంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి.

## గణపతికి ప్రత్యేక పూజలు

అగనంపూడి, (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రులను పురస్కరించుకుని 85వ వార్డు పెదమడక సంపత్ వినాయక ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి అష్టోత్తర శతమార్చన, పంచహారతి పూజలు చేశారు. ఆలయ కమిటీ భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. .

## వార్డులో అన్నసమారాధన


అన్న సమారాధన చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ, (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వవార్డు గరుడాద్రిపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర ఆలయంలో శని వారం అన్నసమారాధన నిర్వహించారు. ముం దుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ క్యాక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధరమ్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యం లో ఈ కార్యక్రమాలు జరిగాయి. అలాగా ఆది ఆంధ్ర యువజన సంఘం భారీ అన్న సమారాధన నిర్వహించింది.

## యూరియా పంపిణీ

పెందుర్తి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మం డలంలోని పలు గ్రామాల రైతులకు వ్యవ సాయాధికారులు శనివారం 24 టన్నుల యూరియా పంపిణీ చేశారు. సరిపల్లికి 12 టన్నులు, పినగాడిలో 12 టన్నులు అందజేశారు. యూరియా పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో రైతులు అధిక సంఖ్యలో రైతు సేవా కేంద్రాలకు తరలివచ్చారు. ఆధార్ కార్డు, పట్టదారు పాసు పుస్తకం పరిశీలించి ఎక రాకు 1 బస్తా మాత్రమే ఇచ్చారు. రైతుల అవసరాలకు తగ్గట్టుగా యూరియా పంపిణీ చేస్తామని ఏఓ చంద్రావతి తెలిపారు.

## సినిమా గైడ్

● **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
● **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
● **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 36, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 30, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 40, బంగాళ దుంపలు 18, అరటి కాయ (పె)10, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 74, బరబాటి 28, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 74, కీరదోస 30, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

**కోడిగుడ్లు (నెక్)**

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 560 |
| విజయనగరం | 564 |
| శ్రీకాకుళం | 564 |

**చికెన్ ధరలు**

బ్యాగ్

| | |
|---|---|
| రైతు ధర | 113 |
| లైవ్ ధర | 133 |
| విత్ స్కిన్ | 236 |
| స్కిన్‌లెస్ | 246 |

## టెక్నికల్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న విజ్ఞాన్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

అగనంపూడి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో సెప్టెంబరు 13 నుంచి 15 వరుకు జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్‌ను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస ర్లను ప్రిన్సిపాల్ జె. సుధాకర్ , రెక్టార్ వి.మధుసూదనరావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టెక్నికల్ ఫెస్ట్ వివరాలు వెల్లడించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీయాలన్న లక్ష్యంతో జాతీయ స్థాయిలో ఫెస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ఫెస్ట్‌ను పురస్కరించుకుని విద్యార్థులు పేపరు, పోస్టర్ ప్రెజంటేషన్ వంటి విభిన్న పోటీలను నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫెస్ట్ కన్వీనర్ క్రాంతికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రెండో రోజూ కొనసాగిన రిలే నిరాహార దీక్ష



నిరాహార దీక్షలో పాల్గొన్న ఎన్ఎంయూ కార్మికులు

కూర్మన్నపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్‌లో ఉన్న ఆర్టీసీ డిపో తరలింపు ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలని కోరుతూ శనివారం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో 2వ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఎన్ఎంయూ స్టీల్‌సిటీ డిపో అధ్యక్షుడు జి.రామకృష్ణ మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యంతో 33 సంవత్సరాల స్టీలుసిటీ డిపో లీజు ముగుస్తున్న నేపథ్యంలో ఇటీవల ఆర్టీసీ యాజమాన్యానికి ఉక్కు యాజమాన్యం నోటీసులు జారీ చేసిందన్నారు. ప్రస్తుతం భూమి విలువ ఆధారంగా లీజు చెల్లించాలని, వడ్డీలేని సెక్యూరిటీ డిపాజిట్‌గా, సేవా చార్జీలుగా కోట్లాది రూపాయిలు చెల్లించాలని కోరడం తగదన్నారు. లీజును పొడిగించి సహకరించాలని స్టీలుసిటీ ఎన్ఎంయూ కార్మికలు కోరారు.

## పట్ట పగలు వెలుగులు


వెంకటసాయినగర్‌లో వెలుగుతున్న లైట్లు

వేపగుంట ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 94వ వార్డు వెంకట సాయినగర్, కొండవాలు ప్రాంతాల్లో వారం రోజులుగా వీధిలైట్లు రాత్రి, పగ లు తేడాలేకుండా వెలు గుతూనే ఉన్నాయి. ఈ విషయమై స్థానికులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. విద్యుత్ దుబారా పట్ల పలువురు విమర్శిస్తున్నారు.

## పాఠశాలకు ఐదు కంప్యూటర్లు వితరణ

పెందుర్తి రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతల అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సెయింట్ ఫౌండేషన్ ఐదు కంప్యూటర్లను వితరణగా అందించింది. వీటిని సర్పంచ్ దాడి గోపి అప్పలనాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సెయింట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బీవీఆర్ రెడ్డి, ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ బొడ్డేటి నూకరాజు, హెచ్ఎం నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే సమస్యలు పరిష్కరించాలని వినతి

కూర్మన్నపాలెం,ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, స్టేషన్ అభివృద్ధికి సత్వర చర్యలు తీసుకోవాలని భువనేశ్వర్‌లో నిర్వహించిన కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో తూర్పుకోస్తా రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు కంచుమూర్తి ఈశ్వర్, తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్‌ను కోరారు. అనంతరం ఈశ్వర్ మాట్లాడుతూ విశాఖపట్నం నుంచి నర్సాపురం రైలును పునఃప్రారంభించాలని, తిరుపతి డబుల్ డెక్కర్‌కు 2 ఏసీ, 3ఏసీ సదుపాయం కల్పించాలని కోరారు. దువ్వాడలో వందేభారత్‌కు హాల్టు కల్పించాలని, శ్రీకాకుళం, రాజమండ్రి, కాకినాడ, విశాఖ మధ్య షటిల్ సర్వీసులు నడపాలని, దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద అండర్‌పాత్‌వే నిర్మించాలని, కాపు జగ్గరాజు పేట వద్ద ఇరుకు మలుపులు, అండర్ పాత్ వంతెన సమస్య పరిష్కరించాలని, దువ్వాడ ప్లాట్ ఫారమ్-4 వైపు జనరల్ బుకింగ్ కౌంటర్‌లో పీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని విన్నవించారు. విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ రైలులో కోచ్‌లు పెంచాలని, విశాఖ నుంచి బెంగుళూరు, తిరుపతి, చెన్నై రాత్రి ప్రయాణ రైళ్ల కోసం రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపాలని ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో దువ్వాడ రైల్వే వినియోగదారుల సంఘం కార్యనిర్వాహక సభ్యులు జాషువా తదితరులు పాల్గొన్నారు.

## నేడు స్టీల్‌ప్లాంటు కార్మికుల మహా ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంటులో ఈవోఐలను నిరసిస్తూ ఆదివారం కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద మహా ధర్నా చేపట్టనున్నామని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు తెలిపారు. ఈవోఐల విషయంలో యాజమాన్యం వెనక్కితగ్గే వరకు పోరాటాలు చేస్తామని, వాటితో ప్లాంటు భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్నారు. యాజమాన్యంపై ఒత్తిడి పెంచేందుకు వీలుగా ఆదివారం ఉదయం 8 గంటలకు చేపట్టే మహాధర్నాకు ఉక్కు ఉద్యోగులు, కార్మికులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


కొండవాలు ప్రాంతంలో విత్తన బంతుల్ని విసురుతున్న విద్యార్థులు

గోపాలపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని గోపాలపట్నం జేడీ ఫౌండేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. శనివారం ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నరవ గ్రామం లోని కొండవాలు ప్రాంతంలో విత్తన బంతులు వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా వర్షాకాలంలో మైదానం, కొండవాలు ప్రాంతాల్లో విత్తన బంతులు వేస్తున్నామని, ఈఏడాది 25 వేల విత్తన బంతులు వేశామని తెలి పారు. ఈ కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆత్మీయ వీడ్కోలు

గోపాలపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలో జరిగిన జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి హాజరై తిరిగి ప్రయాణమైన ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు నాయకులు, అభిమానులు ఆత్మీయ వీడ్కోలు పలికారు.శనివారం రాత్రి నగరం నుంచి రోడ్డు మార్గంలో విమానాశ్రయానికి చేరుకున్న పవన్‌కల్యాణ్ ప్రత్యేక విమానంలో హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.

## ఎగ్జిక్యూటివ్ అధికారులతో సమావేశం

మల్కాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : షిప్‌యార్డులో ఎగ్జిక్యూటివ్ అధికారులతో శనివారం సమావేశం జరిగింది. మహారాష్ట్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సహకారంతో ఏర్పాటైన ఈ సమావేశానికి 20 మంది ఎగ్జిక్యూటివ్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ సీఎండీ గిరిదీప్ సింగ్ మాట్లాడుతూ అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు.

## సీఐగా లెంక సన్యాశినాయుడు

గోపాలపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : గోపాలపట్నం సీఐగా లెంక సన్యాశినాయుడు శనివారం బాధ్యతలు చేపట్టారు. కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వర్తించిన సన్యాశినాయుడు బదిలీపై ఇక్కడికి వచ్చారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు సాదర స్వాగతం పలికారు.

## భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యం


గోడ కూలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఈఓ త్రినాథరావు

సింహాచలం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఇంజినీరింగ్ అధికారులు పనిచేయాలని సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాధరావు ఆదేశించారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధంపై దృష్టిసారించాలని చెప్పారు. శనివారం ఆయన అధికారులతో కలిసి సింహగిరిపై విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులు ప్రస్తుతం త్రిపురాంతకస్వామి ఆలయం వద్ద కొబ్బరికాయలు కొడుతున్నారని, దాన్ని జోడుభద్రాలకు మార్చాలని అధికారులకు సూచించారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అలాగే భక్తులు తమ వెంట తీసుకువచ్చిన ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లను ఆలయంలోకి తీసుకువెళ్లకుండా ప్రవేశ ద్వారాల వద్ద నిషేధించాలని చెప్పారు. కార్యక్రమంలో ఈఓతో పాటు డీఈఈ డీవీఎస్ రామరాజు, ఏఈఓ పంతం శ్రీనివాస్, పర్యవేక్షణాధికారి రాజ్యలక్ష్మి, పాల్గొన్నారు.


రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

## మేహాద్రిలో వినాయక నిమజ్జనాలు నిషేధం

పెందుర్తి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలకు తాగునీరు అందిస్తున్న మేహాద్రి రిజర్వాయర్‌లో వినాయక విగ్రహాల నిమజ్జనం నిషేధిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈమేరకు రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో పెందుర్తి పోలీసులు శనివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తాగునీరు కలుషితం కాకుండా ఉండాలన్న ఉద్దేశంతో నిమజ్జనాలను నిషేధించినట్టు సీఐ సతీశ్‌కుమార్ చెప్పారు.

## ముగ్గురు నేత్ర దానం


నేత్రదానం చేసిన వారి కుటుంబీకులకు అంగీకార పత్రం అందిస్తున్న సభ్యులు

పెందుర్తి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలానికి చెందిన ముగ్గురు నేత్ర దానం చేశారు. చినముషిడివాడకు చెందిన ఆడబాల నర్సమ్మ ఊపిరితిత్తుల సమస్యతో మృతి చెందగా స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీను ఆమె కుటుంబ సభ్యులతో మా ట్లాడి నేత్ర దానానికి ఒప్పించారు. ఈమేరకు మృతురాలి కార్నియాను సేకరించారు. అలాగే వేర్వేరు సంఘటనల్లో మృతి చెందిన చింతల అగ్రహారంనకు చెందిన ఆడారి అప్పారావు, పెందుర్తిలోని ప్రశాంతినగర్‌కు చెందిన కందాల అరుణకుమారి నేత్రాలను కూడా సేకరించారు. కార్యక్రమంలో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

## మంత్రి లోకేశ్‌కు నాయీ బ్రాహ్మణుల వినతి

**ఎన్ఏడీ జంక్షన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి)** : ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు 50 ఏళ్లు దాటిన నాయీ బ్రాహ్మణులకు పింఛన్, రూ. 10 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించాలని ఆ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు నరవ పైడిరాజు కోరారు. శుక్రవారం ఆయన విశాఖలో మంత్రి లోకేశ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కూటమి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల దుకాణాలకు విద్యుత్ రాయితీ ఇవ్వడం హర్షనీయమన్నారు.

## కృషి, పట్టుదలతోనే విజయాలు సొంతం

» ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు


బాక్సింగ్‌లో స్వర్ణ పతకం సాధించిన కనక దీపికను అభినందిస్తున్న ఎమ్మెల్యే పల్లా

కూర్మన్నపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కష్టపడే తత్వం, కృషి, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా విజేతలుగా నిలవచ్చని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 87వ వార్డుకు చెందిన కణితి కనక దీపిక ఇటీవల తిరుపతిలో జరిగిన అమరావతి చాంపియన్స్-2025 రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించింది. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, వార్డు కార్పొరేటర్ బొండా జగన్ ఆధ్వర్యంలో గాజువాక పార్టీ కార్యాలయంలో దీపికను శనివారం ఎమ్మెల్యే పల్లా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలంలో క్రీడల్లో రాణించిన వారికి మంచి భవిష్యత్తు ఉన్న దన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు


కప్ప స్తంభం వద్ద పరిశ్రమల శాఖ కార్యదర్శి అవినాష్‌జోషి

సింహాచలం, ఆగస్టు 30 (ఆంధ్ర జ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని పలువురు ప్రముఖులు శనివారం దర్శించుకున్నారు. స్వామివారిని దర్శిం చుకున్న వారిలో రాష్ట్ర ప్రభుత్వ ఆహార ప్రోసెసింగ్,పరిశ్రమల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అవినాష్ జోషి, పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) ఉన్నారు. వారికి దేవాలయ సహాయ కార్యనిర్వాహణాధికారి కె.తిరుమలేశ్వరరావు ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండప ప్రదక్షిణ చేసిన ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదా దేవి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు శేషవస్త్రాలతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు.



ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన 'సేనతో సేనాని' సభలో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్, వేదికపై పార్టీ నాయకులు



సేనతో సేనాని సభలో ప్రసంగిస్తున్న పవన్ కల్యాణ్

# జనసేనలో ఫుల్ జోష్


సభను ప్రారంభిస్తున్న వీరమహిళ గోవిందమ్మ

మహారాణిపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం జరిగిన 'సేనతో సేనాని' సభకు జన సైనికులు పోటెత్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచే సమావేశ ప్రాంగణానికి చేరుకోవడంతో కుర్చీలు నిండిపోయాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జనసేన జెండా, కండువాలను ఊపుతూ అరుపులు, కేకలు, ఈలలు వేశారు. కార్యకర్తలు మాట్లాడుతున్న సమయంలో జన సైనికులు ఉత్తేజం పొందారు. కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానుల కోరిక మేరకు పవన్ కల్యాణ్ కండువా వేసుకుని, జెండాలు పట్టుకోవడంతో ఉప్పొంగిపోయారు. పవన్ మాట్లాడుతున్నంత సేపు జనసైనికులు కరతాళధ్వనులతో హోరెత్తించారు. దక్షిణ ఎమ్మెల్యే, పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ సభను ముందుండి నడిపించారు.


వేదికపై పవన్ కల్యాణ్, నాదెండ్ల, దుర్గేశ్ చిరునవ్వులు


పార్టీ కార్యకర్తలు, నాయకుల హర్షాతిరేకాలు


సభకు హాజరైన జనసేన కార్యకర్తలు


పవన్ ప్రసంగానికి కేరింతలు కొడుతున్న వీర మహిళలు


పార్టీ గుర్తు గాజుగ్లాసు, కండువాతో వీరమహిళ



ఒడిశా నుంచి వచ్చిన అభిమానులతో పవన్ కల్యాణ్


బెంగళూరు నుంచి వచ్చిన విద్యార్థి నాయకులు


దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న పవన్


అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


సభకు హాజరైన కోన తాతారావు, జిల్లా నాయకులు


సభా వేదికపై ఎమ్మెల్యేలు కొణతాల, పంచకర్ల, సుందరపు, తదితరులు

## జనసేన సభలో పదనిసలు


తెలంగాణ నుంచి వచ్చిన అభిమానులు


కర్ణాటక, సోలాపూర్ నుంచి వచ్చిన జన సైనికులు

మహారాణిపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): 'సేనతో సేనాని' కార్యక్రమానికి తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోరుట్ల నుంచి పలువురు తరలివచ్చారు. 'స్వరాజ్య స్థాపనకై సనాతన ధర్మ పరిరక్షకుడు' తమ ప్రాంతంలో అడుగు పెట్టాలని కోరుకుంటూ స్టేడియం లోపల బ్యానర్లు ప్రదర్శించారు. కర్ణాటక, మహారాష్ట్రలోని సోలాపూర్ తదితర ప్రాంతాల నుంచి ఆరు బస్సులలో సుమారు 400 మంది సమావేశానికి తరలివచ్చారు. సభ జరిగే ఇందిరా స్టేడియంలోకి మధ్యాహ్నం 12 గంటల నుంచి అభిమానులు, కార్యకర్తలు చేరుకున్నారు. వీవీఐపీలు, వీఐపీల కోసం ఏర్పాటుచేసిన కుర్చీలు నిండిపోయాయి. కొద్ది రోజుల కిందట పడిన వర్షాలకు స్టేడియంలో నీరు ఆరకపోవడంతో ఆ ప్రాంతం చిత్తడిగా మారింది. నేల మీద పరదాలు వేసినా నడిచే వారికి అసౌకర్యంగా ఉందని పలువురు తెలిపారు.



## వైభవుని దర్శించుకున్న కేంద్ర మంత్రి

మురళీనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని ప్రసిద్ధ ఆలయమైన వైభవ వేంకటేశ్వర స్వామిని శనివారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ బి.ప్రసాద్, అర్చకుడు శేషస్వామి, మందిరం కమిటీ సభ్యులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ చేయించి, స్వామి ప్రత్యేక పూజార్చనలతో వేద ఆశీర్వచనం అందజేశారు. మందిరంలోని స్వామి చిత్రపటాన్ని ఆయనకు అందజేసి, శేషవస్త్రంతో సత్కరించారు. మంత్రి వెంట తెలుగుదేశం పార్టీ 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ తదితరులు ఉన్నారు.


కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ బి.ప్రసాద్, ఆలయ అర్చకుడు శేషస్వామి

## జనసేనలోకి మాజీ ఎమ్మెల్యే రెహమాన్

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, వీఎంఆర్‌డీఏ మాజీ చైర్మన్ ఎస్ఏ రెహమాన్ శనివారం జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి ఆ పార్టీలో చేరారు. అతనికి కండువా వేసిన పవన్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


రెహమాన్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అధినేత పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే వంశీకృష్ణ



## మయూరేశ గణపతిగా సంపత్ వినాయగర్

సిరిపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సంపత్ వినాయగర్ దేవాలయంలో శనివారం స్వామివారు శ్రీమయూరేశ గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. గణపతి హోమం, నాదస్వరం, ఉభయదాతలతో ప్రత్యేక అభిషేకాలు చేయించారు. ఆలయ ఆవరణలో భక్తులకు నారాయణ సేవ నిర్వహించినట్టు ఈవో డీవీవీ ప్రసాదరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు. సాయంత్రం డా.తామ సందీప్‌శర్మ 'దక్షిణామూర్తి వైభవం' ప్రవచనం చేశారు. స్వామిని కేంద్ర పౌర విమానయా శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం తరపున శేషవస్త్రాన్ని, ప్రసాదాన్ని అందజేశారు.


మయూర వాహనంపై దర్శనమిస్తున్న గణనాథుడు

## ప్రశాంత్‌కు పవన్ కల్యాణ్ అభినందన

భీమునిపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దుబాయ్, అబూదబీలో సెప్టెంబరు 9 నుంచి జరగనున్న ఆసియాకప్ 20-20 క్రికెట్ పోటీలకు టీమిండియా మేనేజర్‌గా నియమితులైన పీవీఆర్ ప్రశాంత్‌ను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందించారు. భీమవరం ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు కుమారుడు ప్రశాంత్ విశాఖలో డిప్యూటీ సీఎంను శనివారం కలిశారు. ఈ సందర్భంగా తెలుగు వ్యక్తికి అరుదైన గౌరవం దక్కడంపై పవన్ ఆనందం వ్యక్తం చేశారు. ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) ఉపాధ్యక్షుడిగా పనిచేసిన ప్రశాంత్ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అల్లుడు.


ప్రశాంత్‌ను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం

## రుషికొండ ప్యాలెస్‌పై మంత్రికి ఏపీటీఎఫ్ లేఖ

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రుషికొండలో పర్యాటక శాఖ నిర్మించిన భవనాన్ని ఎలా ఉపయోగించాలో సూచనలతో పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్‌కు టూరిజం ఫోరం (ఏపీటీఎఫ్) అధ్యక్షుడు కె.విజయమోహన్, కార్యదర్శి ఎంవీ పవన్ కార్తీక్ శనివారం లేఖ అందజేశారు. సమావేశాలు, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్ అండ్ ఎగ్జిబిషన్స్ (మైస్) హబ్‌గా ఉపయోగించుకోవాలన్నారు. ఈవెంట్స్, కన్వెన్షన్ సెంటర్‌గా వాడుకోవచ్చునన్నారు. అమెరికన్, సింగపూర్, అరబ్ కాన్సులేట్, టూరిజం అండ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు.

## సస్పెండైన జైలు అధికారులపై కొనసాగుతున్న దర్యాప్తు

ఆరిలోవ ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్ర కారాగారాగంలో గతంలో విధులు నిర్వహించి సస్పెండైన జైలు అధికారులు, వార్డర్‌పై శనివారం జైళ్ల శాఖ ఉన్నతాధికారుల బృందం దర్యాప్తు చేపట్టింది. జైలులోసాయంత్రం ఆరు గంటల వరకు దర్యాప్తు కొనసాగింది. గుంటూరు రేంజ్ డీఐజీ వరప్రసాద్, కడప జైలు సూపరింటెండెంట్ రాజేశ్వరరావు దర్యాప్తు బృందంలో ఉన్నారు. గత సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్, అదనపు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ కమలాకర్, వార్డర్ వాసు దేవరావుపై దర్యాప్తు కొనసాగుతోంది.

## కస్టమ్స్ బ్రోకర్స్ అసోసియేషన్ కార్యవర్గం

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కస్టమ్స్ బ్రోకర్స్ అసోసియేషన్ ఎన్నిక జరిగింది. 2025-27 సంవత్సరాలకు నూతన అధ్యక్షుడిగా మెర్లిన్ షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ రోలాండ్ విలియమ్స్, కార్యదర్శిగా శ్రావణిషిప్పింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ జి.శ్రావణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## అక్టోబరు 15న ఏయూ స్నాతకోత్సవం

విశాఖపట్నం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) ఆంధ్ర విశ్వవిద్యాలయం 91, 92 సంయుక్త స్నాతకోత్సవం అక్టోబరు 15న కట్టమంచి రామలింగారెడ్డి కాన్వొకేషన్ హాలులో జరుగనుంది. స్నాతకోత్సవానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 9 గంటలకు తమకు కేటాయించిన సీట్లలో కూర్చోవాలని సూచిస్తూ రిజిస్ట్రార్ ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ హాజరవుతారు. ఇటీవల వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు స్నాతకోత్సవ నిర్వహణ తదితర అంశాలను వివరించి అనుమతి తీసుకున్నారని పేర్కొన్నారు.

## స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు డైరెక్టర్ల నియామకం

విశాఖపట్నం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ కార్పొరేషన్‌లో జిల్లాకు చెందిన ఇద్దరిని డైరెక్టర్లుగా నియమించారు. దక్షిణ నియోజకవర్గంలోని 35వ వార్డు టీడీపీ నేత బుచ్చా రామిరెడ్డి, పశ్చిమకు చెందిన జనసేన నాయకురాలు ఎం.నాగలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## తెలుగు మహిళ మాజీ అధ్యక్షురాలి మృతి

అక్కయ్యపాలెం, ఆగస్టు 30 (ఆంధ్ర జ్యోతి): టీడీపీ సీనియర్ నాయకురాలు, జిల్లా తెలుగు మహిళ మాజీ అధ్యక్షురాలు, వుడా మాజీ డైరెక్టర్ అన్నంరెడ్డి వాణి శనివారం మృతి చెందారు. కొద్ది కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు.


అన్నంరెడ్డి వాణి (ఫైల్)

# కోటి లింగాల వినాయకుడి దర్శనం నిలిపివేత

### పోలీసుల ఆదేశాలతో గేట్లు మూసేసిన నిర్వాహకులు

### సీపీ చొరవతో మధ్యాహ్నం తెరచుకున్న గేట్లు

మల్కాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కొత్తనక్కావానిపాలెం ఏపీఐఐసీ స్థలంలో పారిశ్రామిక ప్రాంత లంబోదర అసోసియేషన్ ఏర్పాటు చేసిన కోటి లింగాల వినాయకుడి దర్శనం వివాదంగా మారింది. గాజువాకకు చెందిన బాలిక సాహితి ఈ విగ్రహంలో ప్లాస్టిక్ ఆఫ్ పారిస్ వినియోగించారని, పర్యావరణానికి హాని అంటూ ఉన్నతాధికారులకు, లంబోదర అసోసియేషన్ ప్రతినిధులకు లాయర్ నోటీసులు పంపించిన నేపథ్యంలో పోలీసులు స్పందించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం అసోసియేషన్ ప్రతినిధులకు ఫోన్ చేసి దర్శనాలను నిలుపుదల చేయాలని ఆదేశించడంతో వారు గేట్లను మూసివేశారు. అప్పటికే భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ ప్రాంగణంలో స్టాల్స్ ఏర్పాటు చేసిన వ్యాపారులు తాము నష్టపోతామని గగ్గోలు పెట్టారు. అయితే తమ నుంచి లంచాలు ఆశించారని ఇవ్వకపోవడంతో ఇలా చేస్తున్నారని నిర్వాహకులు ఆరోపించారు. అనుమతులు తీసుకుని విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. వివిధ ప్రాంతాల్లో పీవోపీతోనే విగ్రహాలు ఏర్పాటు చేశారని, వాటికి ఎందుకు నోటీసులు ఇవ్వలేదని ప్రశ్నించారు. బాలికను పావుగా వాడుకుని పలువురు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారన్నారు. భక్తుల నుంచి డిమాండ్ పెరగడంతో స్థానికులు సీపీకి ఫోన్‌చేసి దర్శనాలు కల్పించాలని కోరారు. దీంతో మధ్యాహ్నం ఒంటి గంట తరువాత ఉచిత దర్శనాలకు అనుమతి లభించింది. కాగా సాయంత్రం స్టాల్స్‌ను కూడా తెరిచి వ్యాపారాలు ప్రారంభించారు.



గేట్లు మూసివేయడంతో నిరీక్షిస్తున్న భక్తులు